https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారధ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 51 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ ఆదివారం,నవంబర్,22, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-


"అక్షరమే ఆయుధంగా...
ప్రజలే బలంగా...
18 ఏళ్లుగా విశ్వసనీయతతో సాగుతున్న
'డీకే చాటింపు' అక్షర ప్రస్థానం."
18th Anniversary
డీకే చాటింపు
18 వసంతాలు... ప్రజల విశ్వాసం...
నిజాన్ని నిర్భయంగా చాటే 'డీకే చాటింపు' కి
హృదయపూర్వక వార్షికోత్సవ శుభాకాంక్షలు.
నిజాన్ని చాటుతూ... ప్రజల గొంతుకగా నిలుస్తూ... 18 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానం — డీకే చాటింపు.
17 ఏళ్ల అక్షర ప్రయాణం.. ప్రజల అదరిచే చిరస్థాయి బలం... మరిన్ని విజయవంతమైన సంవత్సరాలకు నాంది.

కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి 4 సూటి ప్రశ్నలు..?

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం

కాంగ్రెస్ పార్టీని నాలుగు ప్రశ్నలు అడిగిన కేంద్ర మంత్రి రిజిజు-1962 చైనా యుద్ధ అవమానానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్-భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో చెప్పాలన్న మంత్రి-దేశ ఆర్థిక వ్యవస్థను అవమానించారంటూ కాంగ్రెస్‌కు ప్రశ్నలు-ఏపెక్ త్రైపాక్షిక భేటీపై ప్రధాని మోదీని విమర్శించిన రాహుల్





న్యూఢిల్లీ,నవంబర్,21 :కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 1962 నాటి యుద్ధ అవమానానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా? అని ప్రశ్నిస్తూ శనివారం ఆయన నాలుగు సూటి ప్రశ్నలను సంధించారు. చైనాలో జరిగిన ఏపెక్ సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీపై ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించిన రిజిజు.. 1962 భారత్–చైనా యుద్ధంలో తమ గ్రామాన్ని చైనా ఆక్రమించిందని గుర్తుచేశారు. ఆ చారిత్రక అవమానానికి కాంగ్రెస్ ఎప్పుడు క్షమాపణ చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో సమాధానం చెప్పాలన్నారు. మన దేశాన్ని 'పాములు ఆడించేవారి దేశం'గా ఎందుకు ప్రచారం చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ రేట్ ఆఫ్ గ్రోత్' అంటూ ఎందుకు అవమానించారో కాంగ్రెస్ చెప్పాలని ప్రశ్నించారు. అంతకుముందు రాహుల్ గాంధీ స్పందిస్తూ, కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటేఆఅగ్రరాజ్యాల అధినేతల టేబుల్ వద్ద భారత ప్రధాని కూర్చుని ఉండేవారని వ్యాఖ్యానించారు. రాజీపడిన ప్రధానిఎప్పటికీ అక్కడ కూర్చోలేరంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రిజిజు, రాహుల్ దేశంలో ఉన్నా, విదేశాలకు వెళ్లినా భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. విదేశీ భారత వ్యతిరేక శక్తులతో ఆయన చేతులు కలిపారని, భారత ప్రజాస్వామ్యం,ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

గంగా నదిపై "నితీష్ సేతు"

వంతెనను ప్రారంభించిన ప్రధాని మోడీ..





పాట్నా,నవంబర్,21 :బీహార్‌లో గంగానదిపై నిర్మించిన 9.76 కిలోమీటర్ల పొడవైన ఆరు వరసల "నితీష్ సేతు"ను ప్రధాని నరేంద్రమోడీ శనివారం ప్రారంభించారు. వైశాలి జిల్లాలోని బిదుపూర్ బ్లాక్‌ను పాట్నా శివారులోని కచ్చీ దర్గాను ఈ వంతెల అనుసంధానిస్తుంది. బీహార్ మాజీ సీఎం నితీష్ కుమార్ పేరును ఈ వంతెనకు పెట్టారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చింది. నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వంతెన ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ ముందుగా పాట్నా చేసుకున్నారు. విమానాశ్రయంలో నితీష్ కుమార్ ప్రధానికి ఘన స్వాగతం పలిచారు. ఈ సందర్భంగాఇద్దరు నేతలు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను ప్రధాని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పాట్నా ఎయిర్‌పోర్టులో నితీష్ కుమార్ జీని కలవడం ఎంతో సంతోషంగా ఉందనిపోస్ట్ చేశారు. మే నెల తర్వాత ప్రధాని బీహార్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. రూ. 34,470 కోట్లతో నిర్మించిన ఈ వంతెనను ప్రధాని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. మరికొన్ని అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇదే సమయంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం కింద ఇళ్లను పొందిన 26,900 మందికి పైగా లబ్ధిదారులకు గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే, వంతెనకు నితీష్ సేతుఅని పేరుపెట్టడంపై ప్రతిపక్ష ఆర్జేడీ కూటమి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిపై విమర్శలు గుప్పించింది. నితీష్ కుమార్ కొంతకాలం ఆర్జేడీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ వంతెన విషయంలో తమకు కూడా క్రెడిట్ దక్కాలని ఆర్జేడీ భావిస్తోంది.

కొత్తగూడెం వర్శిటీని ప్రపంచంలోనే టాప్-5లో నిలుపుతాం: తుమ్మల



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21: కొత్తగూడెం మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సు ఏర్పాటు చేశారు. సింగరేణి, ఓయూ, కేయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును పూర్వ విద్యార్థులు – విద్యాసంస్థలు – పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి తుమ్మల ప్రసంగించారు.

మైనింగ్ ఇంజనీరింగ్‌లో ఎంతో మంది నిపుణులు కొత్తగూడెం కాలేజ్ నుంచి వచ్చినవారే అని గుర్తుచేశారు. కొత్తగూడెంలో చదివిన పూర్వ విద్యార్థులు, విదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. విద్యారంగంలో తెలంగాణ ఖ్యాతి పెరిగేలా కొత్తగూడెం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్శిటీని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంతంలోనే ఈ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి చాలా ప్రోత్సహించారని.. అందుకే ఈ యూనివర్శిటీని ఖమ్మంలో ఏర్పాటు చేశామని తెలిపారు.

ఎండిపోతున్న పంటలకు

సీతారామ ప్రాజెక్టు జలాలు..

తుమ్మల కీలక ఆదేశాలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21: చేతికందే పంట పొలాలు ఎండిపోకుండా సీతారామ ప్రాజెక్టు భరోసాగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు మొరపెట్టుకున్నారు. చివరితడి కోసం సాగునీరు విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు మంత్రి చర్యలు చేపట్టారు. చివరి తడి కోసం సాగునీరు విడుదల చేయాలని రైతులు చేసిన విజ్ఞప్తిపై ఆయన వెంటనే స్పందించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు వైరా–ఏన్కూరు, రామచంద్రపురం మేజర్ కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ జలాలు రేపటికి ఆయా ప్రాంతాలకు చేరుకోనున్నాయి. విడుదల చేసిన నీటిని పంటల సాగుకు మాత్రమే వినియోగించుకోవాలని రైతులకు మంత్రిసూచించారు. చివరితడిఅందించి పంటలను కాపాడాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

కొత్త పింఛన్లపై సీఎం రేవంత్‌కు కౌశిక్ రెడ్డి రాజీనామా సవాల్

- హుజురాబాద్‌లో కొత్త పింఛన్లు ఇవ్వలేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శ

- ఒక్క కొత్త పింఛను మంజూరు చేసినట్లు తేలితే రాజీనామా చేస్తానని సవాల్

-నియోజకవర్గంలో 1,029 పింఛన్లను రద్దు చేశారని ఆరోపణ



హైదరాబాద్,నవంబర్,21: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్‌హుజురాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయలేదని,పైగాఅర్హులైన పేదల పింఛన్లను తొలగించిందని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో పింఛన్ల అంశంపై సీఎంకు ఆయన నేరుగా రాజీనామా సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... "ఒక్క కొత్త పింఛను ఇచ్చినా నాఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. లేకుంటే సీఎం పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేస్తారా" అంటూ ఆయన సవాల్ చేశారు. తన నియోజకవర్గంలో లబ్ధిదారుల సంఖ్య పెరిగినట్లు అధికార పక్షం నిరూపిస్తే తాను క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకుంటానని, అలా నిరూపించలేకపోతే సీఎం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం హుజురాబాద్‌లో దాదాపు 1,029 చేయూత పింఛన్లను రద్దు చేసిందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. గతంలో వృద్ధులకు ఉన్న రూ. 200 పింఛన్‌ను కేసీఆర్ రూ. 2 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 4 వేలకు పెంచి పేదలకు అండగా నిలిచారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో ప్రతి నెలా 45 లక్షల మందికి పింఛన్లు అందేవని పేర్కొన్నారు.

ఇంకా తేలని ఎస్పీ-కాంగ్రెస్ సీట్ల షేరింగ్..



పాట్నా,నవంబర్,21 :ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ముందు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు అంశం కీలకంగా మారింది. యూపీలోని 403 స్థానాల్లో కాంగ్రెస్ 180కి పైగా సీట్లను కోరుతోంది. ఇదే సమయంలో ఎస్పీ 24 సీట్లను ఆఫర్ చేస్తోంది. దీంతో పొత్తు చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. ఇదిలా ఉంటే, పొత్తులపై శనివారం ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్‌తో చర్చలు కొనసాగుతున్నాయని, సీట్ల పంపకంతో గెలుపు అవకాశాలకే ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. గతంలో కూడా ఆయన కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందనే అంచనాలు ఉంటేనే సీట్లు ఇస్తామనే విషయాన్ని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనే విషయంపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. లక్నోలో నిర్వహించిన విలేకరులు సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. సీట్ల పంపకానికి విజయమే ప్రాతిపదిక అవుతుందని స్పష్టం చేశారు. అంటే, ఏ నియోజకవర్గంలో ఎవరికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని సీట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.ఇదే సమయంలో ఎన్నికల సంఘంపై అఖిలేష్ విమర్శలు గుప్పించారు. ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కై పనిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని గుడ్డిగా నమ్మకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. కొంత మంది ప్రభుత్వ అధికారులు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, అలాంటి అధికారులు జాబితా సిద్ధం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో బీజేపీ అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు.


సంవత్సరికం
స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర కార్తీక శుద్ధ త్రయోదశి
తేది : 22-11-2026 ఆదివారం రోజున
మా తండ్రిగారైన
కీ॥శే॥ కందుకూరి వైకుంఠాచారి గారి
సంవత్సరీకం జరుపబడును. కావున తామల్లరు విచ్చేసి
వారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.
భార్య
కందుకూరి శశిరేఖ
కోడుకులు – కోడళ్లు
• కందుకూరి సదానందం – శరణ్య
• కందుకూరి శ్రీనివాస్ – దివ్యభారతి
కూతుళ్లు – అల్లుళ్లు
• పూసాల సరస్వతి – శ్రీనివాస్
• పబ్బోజు శారద – సుమన్
మనుమలు, మనుమరాల్లు
కార్య స్థలం
సహాపంక్తి భోజనం
మా స్వగృహం, హుస్నాబాద్

29 న ఎస్.ఐ ప్రిలిమి నరీ రాత పరీక్ష 2026

పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో సెక్షన్ 163 పోలీస్ కమీషనర్ వెల్లడి

నిజామాబాద్ ప్రతినిధినవంబర్ 21 (డీకే చాటింపు): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 29న 10:00 నుండి 01:00 మధ్యాహ్నం వరకు ఎస్.ఐ ప్రిలిమి నరీ రాతపరీక్ష 2026 ఉంటుందని పరీక్షను ప్రశాంతంగా నిర్వహిం చేందుకు అందరూ సహకరించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వివరించారు. నిజామాబాద్ నగరంలో (20) పరీక్ష కేంద్రాల వద్ద బందో బస్తు ఉంటుందని ఈ సందర్భంగా సూచిం చారు.

1) ఎస్.ఆర్ జూనియర్ కాలేజ్ ,గంగస్తాన్ ఫేస్ 1
2) ఎస్.ఆర్ జూనియర్ కాలేజ్ , బ్యాంక్ కాలనీ ,కంటేశ్వర్
3) సి.ఎస్.ఐ డిగ్రీ కాలేజ్ , కంటేశ్వర్
4) సి.ఎస్.ఐ జూనియర్ కాలేజ్ , కంటేశ్వర్
5) ప్రభుత్వ పాలిటెక్నిక్ , కంఠేశ్వర దేవాలయం
6) నారాయణ జూనియర్ కాలేజ్ , సుభాష్ నగర్
7) ఉమెన్స్ కాలేజ్ , నీల కంఠేశ్వర్ దేవాలయంపక్కన
8) రవి హై స్కూల్ , సుభాష్ నగర్
9) ఎస్.ఎఫ్.ఎస్ హై స్కూల్ ,సుభాష్ నగర్
10) నారాయణ హై స్కూల్ ,సుభాష్ నగర్
11) నిర్మల హృదయ హై స్కూల్,సుభాష్ నగర్
12) నిర్మల హృదయ జూనియర్ కాలేజ్ , సుభాష్ నగర్
13) వాసు హై స్కూల్ , వెంకటేశ్వర కాలనీ , దుబ్బ కెసిపి మెట్రో వెనుక
14) వసుధ హై స్కూల్ , కె.సి.పి మెట్రో వెనుక , దుబ్బ
15) గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీ,ఆటోనోమస్, ఆర్ట్స్అండ్ హ్యుమాని టీస్ బ్లాక్ దుబ్బ
16) గిరిరాజ్ ప్రభుత్వ కాలేజ్ ఆటోనామస్ , పీజీ బ్లాక్ ,దుబ్బ
17) కేర్ డిగ్రీ కాలేజీ , పాత తిలక్ గార్డెన్ , బస్టాండ్
18) ఆదర్శ హిందీ మహావిద్యాలయ , జూనియర్ కాలేజ్ , బస్టాండ్
19) ఎస్.ఎస్.ఆర్ డిగ్రీ కాలేజ్ , రాజీవ్ గాంధీ ఆడిటోరియం , ఖలీల్ వాడి
20) నలంద డిగ్రీ కాలేజ్ (మహిళలు) , రాజీవ్ గాంధీ ఆడిటో రియం

ఇట్టి ఎగ్జామినే షన్ సెంటర్ లో పోలీస్ శాఖ తరఫున కట్టు దిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.



సాయి చైతన్య, తెలిపారు. పరీక్షలు జరిగే రోజు ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు పరీక్షా కేంద్రముల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 BNSS (పాత సెక్షన్ 144 సి.ఆర్.పి.సి) అమలులో ఉంటుం దని వెల్లడించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపు లుగా చేర డం నిషేధం. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేం దుకు అన్ని పరీక్ష కేంద్రాలలో తేది: 29 న (ఉదయం 6:00 గంటల నుండి మధ్యా హ్నం 01:00 గంటల వరకు) సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ షాపులు మరి యుస్టేషనరీ దుకాణా లను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యజమా నులకు సూచనలు జారీచేసినట్లు ప్రత్యేకంగా ఎవరు కూడా సౌండ్ సిస్టమ్ పెట్టరాదని తెలిపారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయబడు తుందని,పరీక్ష కేంద్ర ముల వద్ద అనుమా నాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నిబంధ నలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. పరీక్షలు రాసే విద్యార్థు లందరూ ప్రశాంతంగా , ఆత్మవిశ్వాసంతో పరీ క్షలు రాసి విజయవం తంగా ఉ త్తీర్ణత సాధిం చాలని ఆకాంక్షిస్తూ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ విద్యార్థుల కుఆల్ ది బెస్ట్ తెలిపారు.

హామీ ఇచ్చారు.. ఎంపీగా వంశీని గెలిపించాం....

మంత్రి వివేక్ నేతకానీ కార్పొరేషన్ ను అడ్డుకుంటున్నారు: నేతకాని నేతల ఆగ్రహం..



బెల్లంపల్లి (డీకే చాటింపు) ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన నేతకాని సమాజానికి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు గోమాస సచిన్ మాట్లాడుతూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మూడు లక్షలకు పైగా జనాభా ఉన్నప్పటికీ తమ సమాజానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని నాయకులు పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో చెన్నూరు, పెద్దపల్లి నియోజకవర్గాల్లో టికెట్లు ఆశించినప్పటికీ అనివార్య కారణాల వల్ల దక్కలేదని, అప్పుడు ముఖ్యమంత్రి, ఎంపీ గడ్డం వంశీ నీ గెలిపిస్తే మంత్రి వివేక్ వెంకటస్వామి నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే తమ సమాజమంతా ఏకమై కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిందని తెలిపారు. అయితే, ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కార్పొరేషన్ అంశాన్ని పక్కన పెట్టారని నాయకులు ఆరోపించారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, అడ్డూరి లక్ష్మణ్ తదితరులు నేతకాని సమాజ అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి లేఖలు రాసినప్పటికీ, స్థానిక ప్రజాప్రతినిధులు వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ దీనికి అడ్డుపడుతున్నారని వారు విమర్శించారు. నేతకాని కార్పొరేషన్‌కు బదులుగా జీవో నెంబర్ 2 ద్వారా మాల కార్పొరేషన్ కి ఏర్పాటుకి జీఓ తెచ్చారు. ఉ పకులంగా చేర్చడం తమ సమాజాన్ని రాజకీయంగా, ఆర్థికంగా అణచివేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు తమ వైఖరిని మార్చుకుని వెంటనే నేతకాని కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో నేతకాని ఆగ్రహాన్ని తగిన చూడవలసి వస్తుంది.కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నప్పటికీ వివేక్ వెంకట స్వామి అడ్డుకుంటున్నారు. తక్షణమే దీనిపై ప్రకటన చేయకపోతే భవిష్యత్తులో ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు దుర్గం సోమయ్య, గట్టు భానేష్ శివలింగం,రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జై విశ్వకర్మ! జై జై విశ్వకర్మ

-ట్యాంక్‌బండ్‌లో జగద్గురు శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఘనంగా 418వ జన్మదినోత్సవ వేడుకలు

హైదరాబాద్, (డీకే చాటింపు) హైదరాబాద్: జగద్గురు శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 418వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈరోజు హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న స్వామివారి విగ్రహానికి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కొలే జగన్నాథం గారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తిపూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.భారతదేశ ఆధ్యాత్మిక చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించుకున్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారు గొప్ప తత్వవేత్త, మహజ్ఞాని, కాలజ్ఞాన రచయిత, సిద్ధపురుషులు. భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను తన కాలజ్ఞానం ద్వారా ముందుగానే తెలియజేసిన మహనీయులుగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కులమతాలకు అతీతంగా మానవతా విలువలు, సమానత్వం, సత్యం, ధర్మం, ఆధ్యాత్మిక చింతనను తన బోధనల ద్వారా ప్రజలకు అందించారు.స్వామివారు అందరివారు. వారి బోధనలు ఒక్క వర్గానికో, ఒక ప్రాంతానికో పరిమితం కాకుండా యావత్ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ స్వామివారిని దర్శించుకుని, వారి ఆశీస్సులు పొందాలని, సమాజంలో శాంతి, సౌభాగ్యం, ఐక్యత నెలకొనాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ



సందర్భంగా ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ సలహాదారులు శ్రీ అక్కెనపల్లి లక్ష్మణాచారి గారు, పాస్‌పోర్ట్ శ్రీను గారు, శ్రీ నాగాచారి గారు తదితరులు పాల్గొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. మహనీయుల జన్మదినాలను స్మరించుకోవడం అంటే వారి ఆశయాలను, ఆధ్యాత్మిక సందేశాలను భావితరాలకు అందించడమే. వీరబ్రహ్మేంద్రస్వామివారి కాలజ్ఞాన తత్వం, మానవతా సందేశం తరతరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్‌లో సత్య ఏజెన్సీస్ రెండో షోరూమ్ ప్రారంభం -- వనస్థలిపురంలో భారీ ప్రారంభోత్సవ ఆఫర్లు!

ఎల్బీనగర్, (డీకే చాటింపు) హైదరాబాద్ నగరంలో వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో సత్య ఏజెన్సీస్ తన రెండో షోరూమ్‌ను వనస్థలిపురంలో ఘనంగా ప్రారంభించింది.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, వినియోగదారుల ఆదరణ, నమ్మకమే సత్య ఏజెన్సీస్ అభివృద్ధికి ప్రధాన బలమని తెలిపారు. హైదరాబాద్‌లో రెండో షోరూమ్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లతో పాటు అదిరిపోయే బహుమతులను ప్రకటించారు! ఎంపిక చేసిన ఉత్పత్తులపై భారీ డిస్కౌంట్లు. – కొనుగోళ్లపై ఆకర్షణీయమైన క్యాష్‌బ్యాక్ ఆఫర్లు. – సులభమైన జీరో% నదుపాయాలు, జీరో డౌన్ పేమెంట్. – టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, మొబైల్స్ తదితర గృహోపకరణాలపై ప్రత్యేక ఆఫర్లు. – ప్రతి 3 గంటలకు ఒక అదృష్ట విజేతకు సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్ బహుమతిగా అందించే ప్రత్యేక బహుమతి కార్యక్రమం! వనస్థలిపురం ప్రజలు ఈ అద్భుతమైన

ప్రారంభోత్సవ ఆఫర్లు, బహుమతుల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.
సత్య ఏజెన్సీస్ -- మీ నమ్మకానికి చిరునామా!

ఎత్తిపోతల పథకంతో

జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధి

-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మత్స్యకారులకు లబ్ధి... -నీరు సమృద్ధిగా ఉంటేనే మత్స్య సంపద వృద్ధి... -మత్స్య సంపద వృద్ధి చెందితేనే మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండుతాయి... -జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్ ముదిరాజ్... -నారాయణపేట జిల్లా కేంద్రంలో ఘనంగా ప్రపంచ మత్స్య కార దినోత్సవ వేడుకలు...

మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మత్స్యకారులకు లబ్ధి చేకూరున్నట్లు నారాయణపేట జిల్లా మత్స్య శాఖ అధ్యక్షులు ఎ.కాంత్ కుమార్ ముదిరాజ్ తెలిపారు.ప్రపంచ మత్స్య కార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నారాయణపేట జిల్లా మత్స్య శాఖ కార్యాలయం దగ్గర కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించుకున్నారు.జిల్లా అధ్యక్షులు ఎ.కాంత్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత కుమార్ ముందుగా కేక్ కట్ చేసి మిఠాయి పంచిపెట్టి శు భాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజానికి పోషకాహారాన్ని అందిస్తూ,దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న మత్స్య కారుల కృషి ఎంతో అభినందనీయం అని పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా అభివృద్ధిలో మక్తల్- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కీలక పాత్ర పోషించనుందని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని చెరువు,కుంటలు, జలాశయాలకు నీటి లభ్యత పెరిగితే వ్యవసాయ రంగంతో పాటు మత్స్య రంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ పథకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి,రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి,డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డికి ఈ సందర్భంగా జిల్లా మత్స్య కారుల సహకార సంఘాల తరుపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.నీటి వనరులు సమృద్ధిగా ఉంటే చేపల ఉత్పత్తి పెరుగుతుందని,తద్వారా వేలాది మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి, ఆర్థిక భరోసా లభించే అవకాశం ఉంటుందన్నారు. రోహు,కట్ల,మృగాల వంటి దేశీయ చేపల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు, ఆధునిక హ్యాచరీలు,చేపల మార్కెటింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్య కార సహకార సంఘాలను బలోపేతం చేసి, ప్రతి గ్రామంలోని మత్స్య కారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు పరిధిలోని చెరువులు,జలాశయాల్లో మత్స్య శాఖ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో చేప పిల్లలను విడుదల చేసి, స్థానిక మత్స్యకార సంఘాలకు చేపల పెంపకం ద్వారా ఉపాధి కల్పించాలన్నారు.అలాగే మత్స్య కార యువతకు ఆధునిక



చేపల పెంపకం పద్ధతులపై శిక్షణ,చేపల రవాణా వాహనాలు,కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు కల్పిస్తే జిల్లా మత్స్య ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి మరిన్ని ప్రాధాన్యతలు కల్పించాలని, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మత్స్య రంగ అభివృద్ధితో అనుసంధానం చేస్తూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

నీరు సమృద్ధిగా ఉంటే మత్స్య సంపద వృద్ధి

"నీరు సమృద్ధిగా ఉంటే మత్స్య సంపద వృద్ధి చెందుతుందని,మత్స్య సంపద వృద్ధి చెందితే మత్స్య కారుల కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నిండుతాయి." అని జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్ ముదిరాజ్ తెలిపారు. నారాయణపేట జిల్లాను వ్యవసాయంతో పాటు మత్స్య రంగంలోనూ అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దడమే మన లక్ష్యమని ఎ.కాంత్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరఫ్ నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొనంగేరి హన్మంతు, జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ హన్మంతు,జిల్లా వెటర్నరీ అధికారి జగదీశ్వరి,కౌన్సిలర్ రాము,ముదిరాజ్ నేతలు సంక్లపూర్ మల్లేష్,కాకర్ల భీమయ్య,వివిధ గ్రామాల మత్స్య సంఘాల అధ్యక్షులు,పేరపళ్ళ సర్పంచ్ అంజప్ప,పబ్లిక్ ప్రసికుటర్ ఆకుల బాలప్ప,మాజీ కౌన్సిలర్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సును అరగంటలోనే

బాధితురాలికి అందజేసిన పోలీసులు

-ఆ పర్సులో రెండు సెల్‌ఫోన్లు,బంగారు గొలుసు, నగదు... -నారాయణపేట పోలీసులకు ప్రశంసలు... -పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు...

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట పట్టణంలో శనివారం ఓ మహిళ పోగొట్టుకున్న పర్సును సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి అరగంట వ్యవధిలోని బాధితురాలికి తిరిగి అందజేసి ప్రశంశాలు పొందారు నారాయణపేట టౌన్ పోలీసులు.వివరాల్లోకి వెళ్తే...దామరగిద్ద మండలం, లోకుర్తి గ్రామానికి చెందిన గాయత్రి నారాయణపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు శనివారం ఉదయం వచ్చారు.ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఫంక్షన్ హాల్‌కు వెళ్లే మార్గమధ్యలో ఉదయం 10:15 గంటలకు ఆమె పర్సు పోగొట్టుకున్నారు.ఆ పర్సులో రెండు సెల్‌ఫోన్లు,బంగారు గొలుసు,నగదు ఉన్నాయి. వెంటనే బాధితురాలు నారాయణపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఎ. వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.ఆయన ఆదేశాల మేరకు మహిళా ఎస్సై గాయత్రి,నారాయణపేట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉ పయోగించి పోగొట్టుకున్న పర్సును10:45 గంటలకు గుర్తించి బాధితురాలికి తిరిగి అందజేశారు.అరగంట వ్యవధిలోనే తన విలువైన వస్తువులు తిరిగి



లభించడంతో బాధితురాలు గాయత్రి ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు తమ విలువైన వస్తువులు పోగొట్టుకున్నప్పుడు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని నారాయణపేట పోలీసులు సూచించారు.

ప్రాపర్టీ దొంగతనం కేసులను చేధించాలి

-నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్... -దొంగిలించబడిన వాటిని వీలైనంత త్వరగా రికవరీ చేసి బాధితులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలి... -కేసుల ఛేదనలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవు... -చోరీ కేసులపై ప్రత్యేక సమీక్షా సమావేశం...

నారాయణపేట,(డీకే చాటింపు): జిల్లా పరిధిలో ప్రాపర్టీ దొంగతనం కేసుల నియంత్రణ,నేరాల ఛేదన, దొంగిలించబడిన ఆస్తుల రికవరీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో నమోదవుతున్న ఆస్తి నేరాలు,ముఖ్యంగా ఇళ్ల దొంగతనాలు,బంగారు ఆభరణాలు,నగదు, వాహనాలు,ఇతర విలువైన వస్తువుల చోరీ కేసులపై పోలీసు అధికారులతో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రాపర్టీ దొంగతనం కేసులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి,ప్రతి కేసును త్వరితగతిన ఛేదించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆస్తి దొంగతనాలకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని స్పష్టం చేశారు.దొంగతనం జరిగిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి,క్లూస్ టీం,క్రైమ్ టీం,డాగ్ స్క్వాడ్ సహకారంతో క్షుణ్ణంగా పరిశీలించాలని,నేరస్థులకు సంబంధించిన వేలిముద్రలు, ఇతర భౌతిక ఆధారాలను సేకరించాలని ఆదేశించారు. బాధితుల నుంచి పూర్తి వివరాలు సేకరించి, దొంగతనం జరిగిన విధానం, సమయం,నేరస్థులు పారిపోయిన మార్గాలు తదితర అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని తెలిపారు.ప్రాపర్టీ దొంగతనం కేసుల్లో నేరస్థులను గుర్తించేందుకు సంఘటనా స్థలాలు,పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ నేరస్థుల ఆచూకీ గుర్తించాలని తెలిపారు. గతంలో దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్థుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,వారి ప్రస్తుత కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు.ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ప్రాపర్టీ దొంగతనాలకు పాల్పడే ముఠాల కదలికలపై కూడా సమాచారాన్ని సేకరించి, అవసరమైన సమన్వయంతో దర్యాప్తు చేపట్టాలని సూచించారు.జిల్లాలో నమోదైన ప్రతి ప్రాపర్టీ దొంగతనం కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని,పెండింగ్ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి త్వరితగతిన ఛేదించేందుకు కార్యాచరణ



రూపొందించాలని తెలిపారు. దొంగిలించబడిన బంగారు ఆభరణాలు,నగదు,ద్విచక్ర వాహనాలు,ఇతర విలువైన వస్తువులను వీలైనంత త్వరగా రికవరీ చేసి బాధితులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దొంగతనం కేసులను చేదించినప్పుడే ప్రజలకు పోలీసులపై విశ్వాసం పెరుగుతుందని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని,బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి తక్షణ స్పందన అందించాలని తెలిపారు. ప్రాపర్టీ దొంగతనం కేసుల ఛేదనలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని,కేసుల దర్యాప్తులో జాప్యం జరగకుండా నిర్దేశిత సమయంలో ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు. ప్రాపర్టీ నేరాల నివారణకు పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, దొంగతనాలకు పాల్పడే నేరస్థులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.కేసుల ఛేదనలో నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు మహేష్,నల్లపు లింగయ్య, సీఐలు శివశంకర్,రామ్ లాల్, భగవంత్ రెడ్డి,సైదులు,ఆర్ఐ విజయభాస్కర్,ఎస్ఐలు వెంకటేశ్వర్లు,భాగ్యలక్ష్మి రెడ్డి, పురుషోత్తం,బాలరాజు, సతీష్ రెడ్డి,నరేష్ రాజు, రమేష్,చంద్రశేఖర్,ఎస్.ఎం. నవీద్,మహేందర్ రెడ్డి, కృష్ణంరాజు,కృష్ణ చైతన్య, శిరీష,గాయత్రి,రేవతి,ఎస్బీ, డీసీఆర్బీ,ఐటీ కోర్,క్లూస్ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం,నవంబర్,22, 2026

ట్రంప్..తిరోగమనం.

ఏదిఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈసుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారు తొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజుల పాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నది వాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు. ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేకదేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు(టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల పైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది.



జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలిచ్చే బాధ్యత సర్కార్‌దే

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం





(డీకే చాటింపు,హైదరాబాద్): జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం అన్నారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల పోరాటానికి తన మద్దతు ఉంటుందని,ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకై గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, పేద ప్రజల మాదిరిగా జర్నలిస్టులు కూడా పేదలేనని, వీరికి కూడా ప్రభుత్వం ఇళ్ళస్థలాలు ఇవ్వాలని కోరారు. ధర్నా కు అధ్యక్షత వహించిన సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కోసం 18 ఏళ్ళుగా సొసైటీ పోరాడుతుందని, గత ప్రభుత్వాలు ఇళ్ళస్థలాలు ఇవ్వకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్ళు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టు సంఘం పేరుతో కొందరు సోకాల్డ్ జర్నలిస్టు నాయకులు తమ సొసైటీ పట్ల తప్పుడు ప్రచారంచేస్తున్నారని, అలాంటి చర్యలను సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షురాలు హేమ సుదర్శన్, జై స్వరాజ్ పార్టీ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్ గౌడ, టీజేఎస్ అధికార ప్రతినిధి సలీమ్ పాషా, నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్య,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు ఆనంచిన్ని వెంకటేశ్వర రావు,ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. కోటేశ్వర రావు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్,సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్, సీనియర్ మహిళా జర్నలిస్టు ప్రియా చౌదరిపాల్గొని ధర్నాకు మద్దతు తెలియజేస్తూ ప్రసంగించారు. ధర్నాలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కుంచం శ్రీనివాస్, వి. రవికుమార్, ఎం. రవికుమార్,సొసైటీ డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు, వీరేశం, మహిళా జర్నలిస్టులు సీబీ లక్ష్మీ, నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతోనే విజయాలు

విజేత శృతి జోయ్‌జోడే



(డీకే చాటింపు,కాచిగూడ): మహిళలు తమ కలలను సాకారం చేసుకోవడానికి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే ఏదైనా సాధించవచ్చని 'దివాలిషియస్ మిసెస్ ఇండియా యూనివర్స్ ఎర్త్--2026' విజేత శృతి జోయ్‌జోడే అన్నారు. ప్రతిభను నిరూపించుకోవడానికి వయసు, వివాహం ఏమాత్రం అడ్డంకులు కావని ఆమె స్పష్టం చేశారు. జైపూర్ వేదికగా 'దివాలిషియస్' సంస్థ, మిసెస్ యూనివర్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి అందాల పోటీల్లో శృతి ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె తన విజయ విశేషాలను పంచుకున్నారు. ఒకవైపు కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూనే, తనకున్న ఆసక్తి, పట్టుదలతో ఈ విజయాన్ని అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భావసార క్షత్రియ రంగరేజ్ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ లోకండే, బీవీఐ అధ్యక్షురాలు అశ్విని పతంగే, భావసార క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ కార్యదర్శి అశ్విన్ కుమార్ పతంగే, హేమారాణి తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో శ్రీ వీరబ్రహ్మంగారి జయంతోత్సవం

ప్రత్యేక పూజలు జరిపిన రాజ్ కుమార్



చిగురు మామిడి (డీకే చాటింపు) కాలజ్ఞానకర్త తత్వవేత్త జగద్గురు శ్రీవిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 418 వ జయంతి కార్యక్రమం చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ మండల కమిటీ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్వామివారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి పాటలతో భజనలతో స్వామిని కీర్తించి పుష్పాంజలి ఘటించి టెంకాయ కొట్టి ప్రసాద నివేదన చేశారు రాజ్ కుమార్ మాట్లాడుతూ 16వ శతాబ్దంలో కీలక నామ సంవత్సర కార్తీక మాస శుద్ధ ద్వాదశి నాడు సరస్వతి నది తీరాన ప్రకృతాంబ పరిపూర్ణయ దంపతులకు వీర బ్రహ్మంగారు జన్మించారు తల్లిదండ్రులు శివైక్యం చెందిన తర్వాత ఆత్రేయ మహాముని పెంచి విద్యాబుద్ధులు నేర్పించాడు తదుపరి వీరపాపమంబ వీరభోజయచార్యులు దత్తపుత్రునిగా స్వీకరించి అలన పాలన చేశారు చిన్ననాడే తల్లికి విశ్వరూపం చూపించి పిండోత్పత్తి క్రమాన్ని తెలిపారు అచ్చమాంబ వద్ద గోపాలనం చేశారు బ్రహ్మానంద రెడ్డికి కన్నులు ఇచ్చాడు కడప నవాబుకు కాలజ్ఞానాన్ని చెప్పాడు పోలేరమ్మతో నిప్పును తెప్పించాడు గోవింద మాంబను వివాహం చేసుకొని ఐదుగురి పుత్రులను ఒక పుత్రికను కన్నాడు కుల మతాలకు అతీతంగా హరిజన కక్కయ్యను దూదేకుల సిద్ధయ్యను శిష్యులుగా చేర్చుకున్నాడు ఆనాడే సంపత్తి భోజనాలు పెట్టించాడు జరుగుతున్నది భవిష్యత్తులో జరగబోయేది తన సాంద్ర సింధు వేదమైన కాలజ్ఞానం ద్వారా అందరికీ తెలియజేశాడు ఇంతటి మహిమాన్వితుడైన వీర బ్రహ్మం గారు చెప్పినట్టే ఈ కలియుగం నడుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనుపోజు బాలకృష్ణమాచారి,కూరెల్ల వెంకటయ్య,రంగు రాజేందర్,విశ్వనాథం సత్తయ్య,వడ్లూరి రాజయ్య,శ్రీరామోజు రాములు, పోలోజు లక్ష్మీనారాయణ,పోలోజు కుమారస్వామి, అనుపోజు చిరంజీవి, వడ్లూరి నరేష్,అనుపోజు శ్రీనివాస్,కొత్తపెల్లి శ్రీకాంత్,కొత్తపెల్లి వినోద్, శ్రీరామోజు తిరుపతి కళాకారులు కుతాడి కొమురయ్య,మొగిలి బొందయ్య, నిలిగొండ కిషన్,నిలిగొండ సదానందం,గౌడ భిక్షపతి,మోర వెంకటమల్లు, చందబోయిన పరశురాములు,మల్లం సూరి,పెనుకుల అవినాష్ పాల్గొన్నారు

సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల అమలును నిశితంగా పరిశీ లించాలి

ఆలిండియా సర్వీసెస్ అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 21(డీకే చాటింపు): ఆలిండియా సర్వీసెస్ అధికారులు తమ శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నిశి తంగా పరిశీలన జరపా లనికలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 14 మందితో కూడిన ఆలిండియా సర్వీసెస్ అధికారులు శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం శనివారం నిజామాబాద్ జిల్లాకు చేరుకున్నారు. ఈ నెల 21 నుండి 28 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుప నున్నారు. సమీకృత జిల్లా కార్యాలయంలో వారు కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకు న్నారు.

అలోక్ సింగ్, లోకేష్ మనోహర్ పాటిల్, మనిష్ పరి హార్, ప్రవీణ్ కుమార్, సచిన్ గోయెల్, శివం, రోమేల్ బిజల్వాన్, అభిషేక్ పరిహార్, దీపక్ శర్మ, నిహాల్ చంద్, పూజా మీనా, శుభం శుభ్, వికాస్ యాదవ్, నిధి కరన్వాల్ లను జిల్లా పాలనాధికారి స్వాగతం పలికి అభి నందనలు తెలియ జేశారు. వీరిని రెండు బృందాలుగా విభ జిస్తూ,ఒక్కో బృందానికి ఒక్కో గ్రామాన్ని క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటాయించారు. ఆర్మూర్ డివిజన్ లోని అంకాపూర్ కు ఒక బృందాన్ని,బోధన్ డివిజన్ లోని భూలక్ష్మి క్యాంపునకు మరో బృందాన్ని కేటాయిం చారు.క్షేత్రస్థాయి సంద ర్శనకు బయలు దేరి వెళ్ళడానికి ముందు కలెక్టర్ ఇలా త్రిపాఠితో భేటీ అయ్యారు. వారికి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. నిజామాబాద్ ప్రధానంగా వ్యవసాయాధారిత జిల్లా అయినందున సాగు రంగంపై ఆధారపడి 70 శాతం మంది జీవనాలు వెళ్లదీ స్తున్నారని వివరిం చారు. జిల్లాలో భారీ నీటి పారుదల ప్రాజెక్టు అయిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్ సాగు, తాగునీటి అవస రాలను తీర్చడంలో ఎంతో కీలకంగా నిలుస్తోందని, అవకా శం మేరకు ఈ ప్రాజెక్టు ను సందర్శించాలని సూచించారు. క్షేత్రస్థా యి పర్యటనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను పరిశీలించాలని, భూ వివాదాల శాశ్వత పరిష్కారంకోసం ప్రభుత్వం ప్రతిష్ట త్మకంగా అమలు చేస్తున్న భూ భారతి కార్యక్రమాన్ని, ప్రజల జీవన స్థితిగతులను గమనించాలని అన్నా రు.అన్ని అంశా లను నిశితంగా పరిశీలన జరిపి ఆకళింపు చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగ రావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ పి.సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఇంచార్జి డీపీఓ నాగ రాజు, సీ.పీ.ఓ రతన్, కలెక్టరేట్ ఏ.ఓ బాల రాజు, ఆర్మూర్, బోధన్ తహసిల్దార్లు సత్యనా రాయణ, విట్టల్ తది తరులు ఉన్నారు.

లేఖపై తప్పుడు ప్రచారం :మాజీ మంత్రి చిన్నారెడ్డి



(డీకే చాటింపు,హైదరాబాద్): కాంగ్రెస్ అధిష్ఠానానికి తాను లేఖ రాసినట్టుగా కొందరు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. అది పూర్తిగా అవాస్తవం. ఇప్పటివరకు ఏ లేఖా రాయలేదు.రాజకీయంగా తనను మరింత ఇబ్బందులపాలు చేసేందుకు కొందరు పనిగట్టుకని ఇటువంటి ప్రచారాలు చేస్తున్నారు.ఇటువంటి ప్రచారాలను నమ్మవద్దని మీడియా మిత్రులందరికీ విన్నవిస్తున్నాను.తప్పుడు ప్రచారాలు చేయవద్దని అందరినీ కోరుతున్నానని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సంక్షేమ సంఘాలకు సపోర్ట్‌గా ఉంటా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చెప్పారు. 132 జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్ కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు శనివారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వివేకానంద్ మాట్లాడుతూ కాలనీవాసులంతా ఐకమత్యంతో ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని, కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘానికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, హరిప్రసాద్, రామకృష్ణ, గణేష్, కోశాధికారి మల్లేశ్వర్, సభ్యులు అప్పారావు, రాజు, బీఆర్ఎస్ సీనియర్ నేతలు సిద్ధిరాములు, సుధాకర్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలోనే భార్యభర్తలు మృతి



జనగామ / స్టేషన్ ఘనపూర్ నవంబర్ 21 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లులో విషాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం

గ్రామస్థుల సమాచారం మేరకు భర్త లోకనాథం (84) శుక్రవారం రాత్రి గంటల 9.50 గంటలకు మృతి చెందారు. భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య రామక్క (75) శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వివరించారు.గంటల వ్యవధిలోనే దంపతులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బుగ్గలో అన్నదానం ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగా హారతి...



బెల్లంపల్లి (డీకే చాటింపు)మండలం లోని కన్నాల లోని శ్రీ బుగ్గ దేవాలయం లో శనివారం బుగ్గ కోనేరు లో పన్నెండు నదులచే గంగ హారతినిర్వహించారు. ఈ కార్యక్రమం బుగ్గ రాజేశ్వరస్వామి అన్నదానట్రస్ట్ చైర్పర్సన్ మాసాడి శ్రీదేవి శ్రీరాములు అధ్యర్యంలో నిర్వహించారు.దేవాలయ అర్చకులు సతీష్ శర్మ వేదమంత్రాలతో నిర్వహించడం జరిగింది ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు. జిల్లపల్లి స్వరూప వెంకటస్వామి, మిట్ట చంద్రయ్య దంపతులు. బాలకృష్ణ,గోపి, అత్తిలి సరోజ, పల్లె భూమేష్,దాతలు గణేష్ స్రవంతి. లక్ష్మి శ్రీహరి. కౌన్సిలర్స్. స్రవంతి. కృష్ణవేణి. బత్తుల అనిత సుదర్శన్.దుగుట స్వప్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా మిట్ట చంద్రయ్య దంపతులచే అన్నప్రాసదా కార్యక్రమం నిర్వహించారు.



వనస్థలిపురం సచివాలయ నగర్ లో సెరాజెం హెల్త్ వెల్

4వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ

వనస్థలిపురం, నవంబర్ 21 :(డికే చాటింపు) వెన్నుపూసను శుద్ధి చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే లక్ష్యంతో పనిచేస్తున్న సెరాజెం హెల్త్ వెల్ సెంటర్ నాలుగు వసంతాలు పూర్తి చేసుకుని, ఐదవ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా సచివాలయ నగర్ లోని సెంటర్ లో 4వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోపాల్ ముదిరాజ్. సెంటర్ నిర్వాహకుడు సైదులును, సిబ్బంది శ్రావణిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎలాంటి మందులు, ఔషధాలు వాడకుండా వెన్నుపూసను శుద్ధి చేసుకుని షుగర్, బిపి, థైరాయిడ్, నరాల బలహీనత వంటి సమస్యల నుండి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఈ సెంటర్ ఒక చక్కటి సువర్ణ అవకాశం. నా ఆరోగ్యం కూడా ఈ సెంటర్ వల్ల నయమైంది. ఈ అవకాశాన్ని ప్రజలకు కల్పించిన సెరాజెం నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇంకా ఎంతో మంది ఆరోగ్యాలను కాపాడవలసిన బాధ్యత ఈ సెంటర్ పై ఉంది. ఈ సెంటర్ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను అని అన్నారు. నాలుగు సంవత్సరాలుగా మమ్మల్ని ఆదరిస్తున్న వినియోగదారులందరికీ ధన్యవాదాలు. సీనియర్ సిటిజన్స్ తో పాటు ఎంతో మంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మా సెంటర్ కు వచ్చి సేవలను వినియోగించుకుంటున్నారు. వనస్థలిపురంలో ఉన్న ఈ



సెరాజెం సెంటర్ వెన్నుపూస ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుని, జీవన నాణ్యతను పెంచుకునే విధానాన్ని సబ్జెక్టు రూపంలోనే కాకుండా అనుభవ రూపంలో కూడా తెలియజేస్తుంది. అవకాశం ఉన్న వారు వచ్చి దానిని తెలుసుకుని, అనుభవం ద్వారా ఆరోగ్య నాణ్యతను పెంచుకోవాలని కోరుతున్నాం. ముందు కూడా ఇదే నమ్మకంతో, అంకితభావంతో సేవలు అందిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, లక్ష్మయ్య, సీనియర్ సిటిజన్స్, సెంటర్ వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణ లో నిజామాబాద్ జిల్లాకు సురక్షిత్ గుర్తింపు అభినంద నీయం:జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 21 (డీకే చాటింపు): హెచ్ఐవి నియంత్రణ లో 95-95-95 లక్ష్యాల సాధన దిశగా మెరుగైన పనితీరు. నిజామాబాద్ జిల్లాలో హెచ్ఐవి / ఎయిడ్స్ నిర్ధారణ నియంత్రణ నివారణ కార్యక్రమాల అమలులో వైద్య ఆరోగ్యశాఖ అధికారు లు, డాప్యూ సిబ్బంది, కనబరిచిన పనితీరు అభినందనీయమని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఇలా త్రిపాఠి ప్రశంసిం చారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో గణనీయ మైన ప్రగతి కనబరిచి నిజాంబాద్ జిల్లా సురక్షిత కేటగిరిలో గుర్తింపు పొందిన నేపథ్యంలో నాకు డిప్యూటీడైరెక్టర్ నరేష్ రెడ్డి , డి ఎం హెచ్ ఓ డాక్టర్ బి రాజశ్రీ మరియు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఐ డి ఓ సి లో జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి సన్మానిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నాకు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మాన్ సమరోహ్ కార్యక్రమం లో రాష్ట్రవ్యాప్తంగా సురక్షితగిరికి నిజామా బాద్ జిల్లా ఎంపికవడం గర్వకారణమని పేర్కొ న్నారు. ఈ సురక్షిత గుర్తింపు జిల్లా యంత్రాంగం వైద్యానికి శాఖ ఎయిడ్స్ నియం త్రణ విభాగం అధికారు లు సిబ్బంది ఐ సి టి సి ఏ ఆర్ టి సి ఎస్ సి కేంద్రాలు స్వచ్ఛంద సేవా సంస్థలు సంబంధిత సిబ్బంది సమిష్టి కృషి సమన్వ యంతో సాధ్యమైందని తెలిపారు. ఇంతటితో సంతృప్తి చెందకుండా ఇదే స్ఫూర్తితో హెచ్ఐవి నిర్ధారణ,నివారణ,విస్తృత స్థాయిలో పరీక్షలు, సకాలంలో చికిత్స అందించడం, హెచ్ఐవి తో జీవిస్తున్న వారికి నిరంతర వైద్య సేవలు



కల్పించడం వంటి కార్యక్రమాలను మరింత సమర్థవం తంగా కొనసాగించా లని అధికారులకు సూచించారు. ప్రజలను అవగాహన పెంపొంది స్తూ ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల సాధనకు సమన్వయం తో పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ నరేష్ రెడ్డి ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ, అడిషనల్ డైరెక్టర్ ఫనీ రేఖ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ భార్గవి, ఏఆర్టి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, డిపిఎం సుధాకర్, డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, సి ఎస్ ఓ నవీన్ , సిపిఓ మోహిజ్ ,వై ఆర్ జి సుధాకర్ , సహా యోగి సమత, స్నేహ సొసైటీ శివ, సిఎస్సి కోఆర్డినేటర్ అఖిల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

భక్తుల పాలిట కొంగు బంగారం

దుబ్బ రాజేశ్వర స్వామి దేవాలయం







నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 21(డీకే చాటింపు): శ్రీ పార్వతీ సహిత దుబ్బ రాజేశ్వర స్వామి దేవాలయం చౌదరి పల్లిలో కార్తీక మాసం ద్వాదశి పర్వదిన సందర్భంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అతి పురాతనమైన ఈ దేవాలయంలో శ్రావణ మాసం,కార్తీకమాసం ,శివరాత్రి , పర్వదినాలలో భక్తులు వచ్చి విశేషంగా పూజలు నిర్వహిస్తారు. ప్రతి సోమవారం భక్తుల సందడి ఉండగా అన్నదాన కార్యక్రమం కూడా దుబ్బాక వాస్తవ్యులు నల్ల నాగరాజం మరియు భక్తుల విరాళాలతో నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుండి మహారాష్ట్ర కర్ణాటక నుండి భక్తులు వస్తా రని ప్రధాన పూజారి భాను శివప్రసాద్ వివరించారు.

రాజ రాజే శ్వరుడు స్వయం భూలింగం గా వెలిసిన కారణంగా నిత్య అభిషేకాలు జరుగు తాయని,ఈ ఆలయం లో భక్తులు నిత్య అభి షేకాలు చేయడం ద్వారా కోరుకున్న కోరికలుతీరుతాయని నమ్మకం ఉండడం, భక్తులకు భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఈ సందర్భంగా పూజా రి కూడా భక్తులను ఆశీర్వదించారు.ద్వాదశి పురస్కరించుకొని తోడుపునూరి యాద య్య పద్మావతి దంప తులు,సత్యనారాయణ సాధన, వెంకటరమణ సంధ్యారాణి,శ్రీకాంత్ స్వాతి,సంజయ్ శ్వేత దంపతులు, సంతోష్ సుగా త్రి,పద్మాంజలి,సంతోషి కుటుంబ సభ్యులు మరియు వివిధ ప్రాంతాలనుండి విచ్చేసిన భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు.

టీ పీసీసీ కంట్రోల్ చేయలేకపోతోందా..?



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినా అధికార పక్షంలో క్రమశిక్షణ అనేది ఒక పెద్ద జోక్‌గా మారిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. విపక్షాలను దెబ్బతీయడం దేవుడెరుగు, సొంత ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలే బహిరంగ వేదికలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను, ప్రభుత్వ విధానాలను ఎండగడుతుంటే టీపీసీసీ నాయకత్వం చేష్టలుడిగి చూస్తోంది. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు నేరుగా ముఖ్యమంత్రి వైఖరిపైనే కామెంట్లు చేస్తుంటే, జిల్లాల స్థాయి నేతల మధ్య గొడవలు రోడ్డెక్కుతున్నాయి. ప్రభుత్వం నడుపుతున్న వేళ ఈ స్థాయిలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కడం పార్టీ క్యాడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది.మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పార్టీలో నిధులతో పాటు పదవుల విషయంలో పాతకాపులకు విలువేదీ, కొత్తగా వచ్చిన వారికే పదవులు దక్కుతున్నాయి అంటూ చేసిన సంచలన వ్యాఖ్యలు గాంధీభవన్‌లో పెద్ద ప్రకంపనలే సృష్టించాయి. దానికి తోడు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏకంగా సీనియర్ల వ్యాఖ్యలకు మద్దతు తెలపడమే కాకుండా, తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటా తరహా హెచ్చరికలు జారీ చేశారు. వీరికి తోడుగా ఇతర ప్రజాప్రతినిధులు కూడా అసెంబ్లీ లోపలా, బయటా మంత్రులను, నిర్ణయాలను ప్రశ్నిస్తుండటంతో అధికార కాంగ్రెస్‌లో విపరీతమైన ఆధిపత్య పోరు సాగుతోందనేది స్పష్టమవుతోంది.జిల్లాలలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు సరిహద్దులు దాటిపోతోంది. తాజాగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య ఢిల్లీ హ్యాటల్ వేదికగా జరిగిన ఘర్షణ కాంగ్రెస్ శ్రేణులను తీవ్రగ్గ్రాంతికి గురిచేసింది. నామినేటెడ్ పదవులు, జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక, ప్రాంతీయ ఆధిపత్యం విషయంలో వీరిద్దరి మధ్య మాటల యుద్ధం జరిగి, అది భౌతిక తీవ్రత స్థాయికి చేరుకుందన్న వార్తలు గాంధీభవన్‌ను ముంచెత్తాయి. ప్రగతి భవన్ లేదా గాంధీభవన్‌లో పరిష్కరించుకోవాల్సిన అంతర్గత విభేదాలను ఏకంగా హస్తిన వీధుల్లో రచ్చకెక్కించడం ద్వారా నేతలు పార్టీకి ఎంతటి పరాభవాన్ని మిగిల్చారో వేరే చెప్పక్కర్లేదు.ఈ విపరీత పరిణామాలకు ప్రధాన కారణం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ , రాష్ట్ర నాయకత్వం పూర్తిగా వైఫల్యం చెందడమే. క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ సుముఖత చూపకపోవడం వల్లనే నేతలకు భయం లేకుండా పోయింది. గతంలో కొందరు చిన్న స్థాయి నేతలకు లేదా బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులకు నోటీసులు ఇచ్చిన కమిటీ, ఎంపీలు, బలమైన ఎమ్మెల్యేలు మరియు మంత్రుల విషయంలో మాత్రం మౌనం వహించడమో లేదా శోకాన్ని నటిస్తూ సమన్వయ కమిటీల పేరుతో కాలయాపన చేయడమో చేస్తోంది. ఈ ద్వంద్వ నీతి వల్లే క్రమశిక్షణ కమిటీ ఉనికి నవ్వులపాలవుతోంది. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచీ ఉన్న తనదైన మార్క్ ప్రజాస్వామ్యం , ఢిల్లీ కల్చర్ కూడా ఈ రచ్చకు మరొక బలమైన కారణం. ఏ చిన్న సమస్య వచ్చినా స్థానిక నాయకత్వాన్ని దాటుకుని నేరుగా ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దల వద్దకు పంచాయితీ తీసుకెళ్లవచ్చనే ధీమా నేతల్లో ఉంది. అంతేకాకుండా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఓర్చుకోలేని కొందరు సీనియర్లు, సమయం దొరికినప్పుడల్లా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు తమ వర్గం ఎమ్మెల్యేలను ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ కూడా ఈ గ్రూపు రాజకీయాల ముందు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజల్లో విశ్వసనీయత పెరగాలంటే సమర్థవంతమైన పాలన మాత్రమే సరిపోదు, బలమైన క్రమశిక్షణ కూడా అంతే అవసరం. క్రమశిక్షణను దాటి విమర్శలు గుప్పించే నేత ఎంతటి శక్తిమంతుడైనా సరే కఠినమైన చర్యలు తీసుకోకపోతే.. రాబోయే రోజుల్లో ఈ అంతర్గత విభేదాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద శాపంగా మారతాయి. విపక్షాలకు తమంతట తాముగా ఆయుధాలు అందిస్తున్న ఈ నేతల స్వేచ్ఛకు వెంటనే అడ్డుకట్ట వేయకపోతే, తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ పాత రాజకీయ రొంపిలోకి జారిపోక తప్పదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

కేసీఆర్ స్థానంలో కేటీఆర్

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ రంగంలో అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్ష బిఆర్ఎస్ ల మధ్య మాటల యుద్ధం రోజురోజుకు మరింత పదునెక్కుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష వైరం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. విధానాలు, పరిపాలనా లోపాల ఆధారంగా విమర్శలు చేసుకోవాల్సింది పోయి.. వ్యక్తిగత రూపం, గెటప్‌లు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, గడ్డం పెంచడం వంటి అంశాల దాకా విమర్శలు వెళ్లడం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఇటీవలి సభల్లో సీఎం రేవంత్ రెడ్డి.. గడ్డం పెంచినంత మాత్రాన ఎవరూ రేవంత్ రెడ్డి కా లేరు అని సెటైర్లు వేయడం, గతంలో కేటీఆర్ లుక్‌పై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్-బీఆర్ఎస్ శ్రేణుల మధ్య పగను మరింత పెంచాయి. అయితే, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నేత, ప్రతిపక్షంలో ఉన్న ఒక నాయకుడి వ్యక్తిగత ఇమేజ్‌పై ఇంతలా దృష్టి సారించి దాడి చేయడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యూహంలో మొదటి ప్రధాన కోణం ? ప్రత్యర్థి గుర్తింపు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాల్లో, మీడియా ముందుకు రావడం గణనీయంగా తగ్గించారు. అసెంబ్లీలో లేదా ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ తరఫున కేటీఆర్, హరీష్ రావులే ప్రధానంగా గళం విప్పుతున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ స్థానంలో బీఆర్ఎస్ ప్రధాన ముఖంగా కేటీఆర్‌ను రేవంత్ రెడ్డి స్వయంగా గుర్తించినట్లేనని పొలిటికల్ పండితులు అంచనా వేస్తున్నారు. కేటీఆర్‌నే తన ముఖాముఖి ప్రత్యర్థిగా ఎంచుకోవడం ద్వారా, ఇతర నాయకులను పక్కకు నెట్టి పోరును రేవంత్ వర్సెస్ కేటీఆర్ గా మలచడం కాంగ్రెస్ వ్యూహంలో భాగం.ప్రతిపక్ష నేతగా కేటీఆర్ లేవనెత్తే అడ్మినిస్ట్రేటివ్ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వ్యక్తిగత విమర్శలు ఒక అస్త్రంగా పనిచేస్తాయి. కేటీఆర్ ఇమేజ్, ఆయన బాడీ లాంగ్వేజ్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆయన ప్రతిష్టను దెబ్బతీయడం, డిఫెన్స్‌లోకి నెట్టడం మరియు మానసికంగా ఆయన విశ్వాసాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ పర్సనల్ ఎటాక్స్ సాగుతున్నాయనే అభిప్రాయం ఉంది. అదే సమయంలో, తెలంగాణ సంప్రదాయ రాజకీయాల్లో మాస్ శైలికి పెద్దపీట ఉంటుంది. కేటీఆర్ అర్బన్, కార్పొరేట్ లుక్‌కు భిన్నంగా తనపక్కా మాస్, తెలంగాణ రఫ్ అండ్ టఫ్ ఇమేజ్‌ను బలంగా చాటుకోవాలని రేవంత్ ప్రయత్నిస్తున్నారు. నేను కేడర్ నుంచి వచ్చిన మాస్ లీడర్‌ను, కేటీఆర్ అలా కాదు అనే సందేశాన్ని ప్రజల్లోకి పంపడానికే ఆయన ఈ తరహా పోలికలను తీసుకొస్తున్నారు.అయితే, ఈ విమర్శల నాణేనికి మరోవైపు కూడా ఉంది. ప్రతిపక్షం లేవనెత్తే మూసీ ప్రక్షాళన, గ్యారెంటీ అస్యూరెన్స్‌లు, విద్యుత్, నీటి సమస్యలు వంటి విధానపరమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, వ్యక్తిగత అంశాలపై పడటం కాంగ్రెస్ ప్రభుత్వ డిఫెన్సివ్ మైండ్ సెట్‌ను చూపుతోందని బీఆర్ఎస్ ఎదురుదాడి చేస్తోంది. పరిపాలనాంశాలపై కంటే ఇలాంటి వ్యక్తిగత పోరు ఎక్కువైతే,



అది చివరికి ప్రజా సమస్యల చర్చను పక్కదారి పట్టిస్తుంది. రేవంత్ రెడ్డి వేస్తున్న ఈ వ్యక్తిగత బాణాలు కేటీఆర్‌ను సైకలాజికల్‌గా దెబ్బతీసేందుకు వేసిన స్కెచ్ కావచ్చు, లేదా కేసీఆర్ లేని లోటును కేటీఆర్‌కు అప్పగిస్తూ ఆయన్ను ప్రధాన ప్రత్యర్థిగా నిలబెట్టే వ్యూహం కావచ్చునని అంచనా వేస్తున్నారు.

ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్ వర్క్

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుకుంటోంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ప్రత్యర్థులపై పైచేయి సాధించాలని పావులు కదుపుతున్నాయి. అయితే, అందరికంటే ముందుగానే అలర్ట్ అయ్యి, ప్రత్యేక వ్యూహాలతో గ్రౌండ్‌వర్క్ ప్రారంభించిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌లో మాత్రం ఇప్పుడు సరికొత్త చర్చ నడుస్తోంది. పార్టీ అధినాయకత్వం ఎంత గట్టిగా ప్లాన్ చేసినా, క్షేత్రస్థాయిలో ఇన్చార్జుల నుంచి వస్తున్న స్పందన మాత్రం గులాబీ బాస్‌లకు షాకిస్తోంది. ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలోని దాదాపు 40 నుంచి 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భావించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం ఊపందుకునేలా ప్రతి నియోజకవర్గంలోనూ ఒక భారీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేయాలని, తాను స్వయంగా వాటికి హాజరవుతా నని కూడా ఆయన స్పష్టం చేశారు. కానీ, ఆచరణలోకి వచ్చేసరికి ఆ ప్లాన్‌కు అనూహ్యంగా బ్రేక్ పడింది. అభ్యర్థి ఎవరో ఖరారు కాకుండా నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు పెట్టడం కష్టమని, పైగా ఈ భారాంతా తమ భుజాల మీదే వేసుకోవడం ఇబ్బందికరమని ఇన్చార్జులు భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు అంటే మాటలు కాదని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. భారీ హాల్స్ బుకింగ్స్, కార్యకర్తలకు భోజనాలు, ఇతర ఏర్పాట్ల కోసం తడిసిమోపెడవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. కేవలం రెండు మూడు నెలల క్రితమే ఎస్ఐఆర్ సన్నాహక సమావేశాల పేరుతో తాము భారీగా ఖర్చు పెట్టామని, అప్పట్లో కేటీఆర్, హరీష్ రావుల పర్యటనల కోసం జేబులు గుల్ల చేసుకున్నామని నేతలు వాపోతున్నారట.

హైదరాబాద్ రవాణా ముఖచిత్రంలో భారీ మార్పులు

హైదరాబాద్: మెట్రో నగరాలలో ట్రాఫిక్ రద్దీ పెద్ద సమస్యగా మారింది. నగరాల సుందరీకరణ, ప్రయాణ సౌలభ్యం కోసం ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితులు, వ్యయ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కొన్ని ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్ లో అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టాల్సిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళికలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ పలు మార్పులు చేసింది.గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం, కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు రూ. 1,090 కోట్ల వ్యయంతో ఏడు అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే.. నగరంలో మారుతున్న ట్రాఫిక్ అవసరాలు, స్థానిక భౌగోళిక పరిస్థితులు, వ్యయ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు.కొత్త ప్రణాళికల ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫ్ఖంజా ఇంజనీరింగ్ కాలేజీ వరకు రూ. 715.16 కోట్ల అంచనా వ్యయంతో సరికొత్త స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన బంజారాహిల్స్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద 2-లేన్ సింగిల్ వే ఫ్లైఓవర్, టీవీ9 జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు వంటి అనేక పనులను రద్దు చేశారు. ఈ మార్పుల వల్ల గతంలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఇచ్చిన కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. అంతేకాక, ఆ ఏజెన్సీ చెల్లించిన డిపాజిట్లను వెనక్కి ఇవ్వాలని నిర్ణయించారు.మొత్తం ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి పనులను వేగవంతం చేయాలని కమిటీ భావిస్తోంది. ప్యాకేజీ-1 పరిధిని జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. గతంలో రూ. 580 కోట్లుగా అంచనా వేసిన ఈ ప్రాజెక్టు వ్యయాన్ని సవరిస్తూ, రూ. 365.85 కోట్లకు కుదించారు. అలాగే రోడ్డు నంబర్-45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్ ప్రాంతాల్లోని పనుల ప్రణాళికను కూడా మార్చారు.ప్యాకేజీ-2 కింద ముగ్ధ జంక్షన్ నుంచి ముఫ్ఖంజా కాలేజీ వరకు, బంజారాహిల్స్ రోడ్డు నంబర్-1కి అనుసంధానించే రాంపుతో కూడిన స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. రూ. 510 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ. 349.31 కోట్లకు సవరించారు.

పింఛన్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణీ

డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్



ఎల్బీనగర్ (డికె చాటింపు) మహేశ్వరం నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన పింఛన్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ పంచాయతీ రాజ్ మరియు రూరల్ డెవలప్మెంట్ మంత్రివర్యులు ధనసరి సీతక్క పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి తో కలిసి పాల్గొన్న మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి , టిపిసిసి సభ్యులదేప భాస్కర్ రెడ్డి , డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పక్క చూపులు చూస్తున్న టీవీకే ఎమ్మెల్యేలు



చెన్నై, : తమిళనాడులో తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరి సరిగ్గా ఆరు నెలలు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ అధ్యక్షతన చెన్నై సమీపంలోని పనైయూర్ వేదికగా ఎమ్మెల్యేల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని నూతన ప్రమాణాలతో నడిపిస్తామని అధికారంలోకి వచ్చిన టీవీకే.. అతి స్వల్ప కాలంలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల వివాదాస్పద ప్రవర్తన వల్ల తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను, ప్రతిపక్షాల దాడిని ఎదుర్కొంటోంది. దీనికితోడు 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మేజిక్ ఫిగర్ 118 కాగా, టీవీకేకు 109 మంది శాసనసభ్యుల బలమే ఉండటం, కాంగ్రెస్, వీసీకే, వామపక్షాల బాహ్య మద్దతుపైనే సర్కారు ఆధారపడి ఉండటంతో.. ప్రభుత్వ మనుగడ ప్రశ్నార్థకంగా మారకుండా ఉండేందుకు పార్టీ పగ్గాలను కఠినతరం చేసేందుకు విజయ్ సిద్ధమయ్యారు.ఇటీవల పార్టీ ప్రజాప్రతినిధులపై వెల్లువెత్తిన వరుస ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీశాయి. కళ్లకురిచ్చి మహిళా జిల్లా కలెక్టర్‌కు అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారన్న అభియోగంపై ఎమ్మెల్యే అరుల్ విఘ్నేశ్ సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలపాలయ్యారు. మరోవైపు తాగునీటి ఎద్దడిపై ప్రశ్నించిన ఒక వృద్ధుడిపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తురైయూర్ ఎమ్మెల్యే రవిశంకర్ చేయి చేసుకున్న వీడియో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. బాధితుడిని పోలీసులతో బెదిరించి బలవంతపు ప్రకటన చేయించారన్న ఆరోపణలు వివాదాన్ని మరింత రాజేశాయి. వీటికి తోడు ఐపీఎల్ మ్యాచ్ చూస్తూ ఒక అనుమానాస్పద పదార్థాన్ని నలిపిన పాత వీడియో కారణంగా మంత్రి శరత్ కుమార్ డ్రగ్స్ ఆరోపణలు ఎదుర్కోవడం, తాంబరం మున్సిపాలిటీ ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలు రావడం, తూత్తుకుడి ఎమ్మెల్యేపై లైంగిక దాడి ప్రోత్సాహం వంటి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం తీవ్ర ఆత్మరక్షణలో పడింది.ఈ పరిణామాలపై డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి ప్రధాన ప్రతిపక్షాలు ఉమ్మడిగా విరుచుకుపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఐసీయూలో పడ్డాయని, పాలన కోమాలోకి వెళ్లిపోయిందని డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలనా అనుభవం లేకపోవడం, కేడర్‌పై నియంత్రణ లోపించడం వల్లే ఇలాంటి బరితెగింపులు జరుగుతున్నాయని విపక్షాలు విమర్శిస్తుండగా.. టీవీకే మాత్రం విపక్షాలే తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆపరేషన్ ఆకర్ష్ కుట్రలు పన్నుతున్నాయని ప్రత్యారోపణలు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావడంతో ప్రతిపక్షాలు సాంకేతికంగా మరోసారి అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించే అవకాశం ఉండటం, త్వరలోనే జరగనున్న 5 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలతో పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ ప్రలోభాలకు గురికాకుండా తమ గూటిని కాపాడుకోవడం విజయ్‌కు అత్యంత క్లిష్టమైన పరీక్షగా మారిందిసొంత పార్టీ కార్యాలయంలో కాకుండా ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో ఈ అంతర్గత భేటీని నిర్వహించేందుకు సన్నాహాలు చేయడం వెనుక ఎమ్మెల్యేలను కాపాడుకునే ఎత్తుగడ స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, మంత్రుల తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న విజయ్.. క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని హెచ్చరించడంతో పాటు అంతర్గత విచారణల ఆధారంగా కొందరి శాఖలను మార్చడం, ఉద్వాసన పలికేలా కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరోవైపు రానున్న ఐదు ఉప ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసి సంపూర్ణ మెజారిటీకి చేరువకావాలన్న వ్యూహాన్ని కూడా ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు. ఏది ఏమైనప్పటికీ, సినిమాల నుంచి సరికొత్త రాజకీయ ఆశలతో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్‌కు.. సొంత ఎమ్మెల్యేల అదుపులేని వైఖరి, సంకీర్ణ సర్కారు సంక్షోభం ఆరు నెలల్లోనే అతిపెద్ద రాజకీయ అగ్నిపరీక్షగా నిలిచాయి.

న్యూఢిల్లీలో ఆర్టిఫిషియల్ రెయిన్



న్యూఢిల్లీ, : దేశ రాజధాని దిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఐఐటీ కాన్పూర్? కీలక నిర్ణయం తీసుకుంది. దిల్లీలో మరోసారి కృత్రిమ వర్షం (క్లౌడ్ సీడింగ్) సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుత వాతావరణంలో మేఘాలు ఏర్పడటానికి, వర్షం కురవడానికి సరిపడా తేమ ఉందో లేదో అంచనా వేసేందుకు ఈ పరిశీలన జరుగుతోందని ఐఐటీ వర్గాలు తెలిపాయి. అనుకూలమైన తేమ పరిస్థితులను సంస్థ నిర్ధరించుకున్న తర్వాతే ఈ ఆపరేషన్‌పై తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పాయి. ఈ ఆపరేషన్ కోసం విమానం సిద్ధంగా ఉందని, అనుమతులు రాగానే ఇది దిల్లీ నుంచే టేకాఫ్ అవుతుందని అధికారులు వెల్లడించారు.
దీపావళి వేడుకల అనంతరం దిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంది. ఉష్ణోగ్రతలు పడిపోవడం, దట్టమైన పొగమంచు కమ్మేయడంతో కాలుష్య తీవ్రత మరింత పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా వాటర్ స్ప్రింక్లర్లను ఉపయోగించి, సూక్ష్మ కణాల ప్రభావాన్ని తగ్గించడానికి దిల్లీ ప్రభుత్వం కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకుంటోంది. బుధవారం ఉదయం 7 గంటలకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (రికార్డు చేసిన గణాంకాల ప్రకారం దిల్లీలో సగటు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 299 పూర్ కేటగిరీగా నమోదైంది.సగటు మెరుగ్గా కనిపిస్తున్నప్పటికీ, దిల్లీలోని పలు కీలక ప్రాంతాల్లో గాలి నాణ్యత 'అత్యంత అధ్వాన్నం' కేటగిరీలోనే కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ డేటా ప్రకారం, ఛావ్లాలో అత్యధికంగా 396 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైంది. ఆ తర్వాతి స్థానాల్లో చాందినీ చౌక్ (379), (375), దిల్లీ (375), నార్త్ క్యాంపస్ (374), (367), బురారీ క్రాసింగ్ (362), పూసా (359), నరేలా (352), జాఫర్‌పూర్ (351), ద్వారక (350), మథుర రోడ్ (348), పంజాబీ బాగ్ (341), (339), అయా నగర్ (337), తల్కటోరా గార్డెన్ (331), వివేక్ విహార్ (326), సిరిఫోర్ట్ (321), వజీర్‌పూర్ (321), జహంగీర్‌పురి (320), బురారీ (315), బదర్‌పూర్ (312), ముండ్కా (305), ఆనంద్ విహార్ (304), బావానా (304) ఆర్.కె. పురం (300) ఉన్నాయి.
రాజధానిలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత 'పేలవమైన' విభాగంలోనే కొనసాగింది. రోహిణిలో 298, అశోక్ విహార్‌లో 298, ద్వారక-సెక్టార్ 8లో 295, జరోడా కలాన్‌లో 289, ఇగ్నో మైదాన్ గర్హిలో 287, ఎఐఎ విమానాశ్రయం (ఐ3) వద్ద 282, అలీపూర్‌లో 279, ఉత్తమ్ నగర్‌లో 259 నమోదయ్యాయి. ఈ విభాగంలో లోధి రోడ్ వద్ద అత్యల్పంగా 203 నమోదైంది.ముందుగా శాస్త్రవేత్తలు కృత్రిమ వర్షానికి అనువైన మేఘాలను గుర్తిస్తారు. అందులో సరిపడా తేమ ఉంటుంది. కానీ, వర్షాలు కురిసేందుకు అనువైన పరిస్థితులు ఉండవు. అలాంటి సందర్భంలోనే సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను చేపడతారు. ఇవి మేఘాల్లోని తేమను కరిగించి, వర్షపు బిందువుల రూపంలో కింద పడేందుకు సహకరిస్తాయి. ఇందుకు కొన్ని సార్లు పొడి మంచును కూడా వినియోగిస్తారు. దీనివల్ల మేఘాలు చల్లబడి వర్షం కురిసేందుకు వీలుంటుంది.

జనవరి నుంచి పల్లె యాత్రకు సిద్ధం



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త పరిపాలనా వ్యూహాలకు, పొలిటికల్ నెరేటివ్‌కు తెరలేపారు. రాబోయే సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ స్వయంగా సందర్శించేలా ప్రజాబలం పేరుతో ఒక భారీ మాస్ కనెక్ట్ కార్యక్రమాన్ని ఆయన సిద్ధం చేసుకున్నారు. కేవలం సచివాలయంలోని ఏసీ గదులు, రివ్యూ మీటింగ్‌ల అధికార దర్పానికి పరిమితం కాకుండా, నేరుగా అట్టడుగు వర్గాల వద్దకు వెళ్లే 'మాస్ లీడర్'గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం మరియు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చెక్కుచెదరని విశ్వసనీయతను పెంచడం ఈ వల్లెబాట ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.రేవంత రెడ్డి ప్లాన్ చేసుకున్న ఈ వ్యూహంలో రెండు స్పష్టమైన పొలిటికల్ యాంగిల్స్ ఉన్నాయి. మొదటిది క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజా అవసరాలను నేరుగా తెలుసుకోవడం మరియు ఎల్‌నినో ప్రభావంతో తలెత్తిన తాగు, సాగునీటి పర్యవేక్షణపై చర్యలు తీసుకోవడం ద్వారా సమ్మేళన సంక్షేమ ముద్రను సాధించడం. ఇక రెండవది, అత్యంత కీలకమైనదిశాసనసభ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ లోపాలను ఆధారాలతో సహా ఎండగట్టడం ద్వారా కేసీఆర్ నిర్మించుకున్న 'నీటిపారుదల రథసారథి' బ్రాండ్ ఇమేజ్‌ను శాశ్వతంగా బద్దలు కొట్టడం. కేసీఆర్ బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల వేదికను సిద్ధం చేస్తున్న రేవంత్.. ప్రత్యక్ష సభ ద్వారా కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన ఆర్థిక, సాంకేతిక లోపాలను ప్రజాక్షేత్రంలో పెట్టాలని భావిస్తున్నారు. బిఆర్ఎస్ తమ హయాంలో సాధించిన అతిపెద్ద విజయంగా చెప్పుకునే కాళేశ్వరాన్ని వైఫల్యాల కాళేశ్వరం గా మార్చడం ద్వారా ప్రతిపక్షాల విమర్శల దాడికి మూలాల్లోనే గండికొట్టాలనేది తాడేపల్లి-హైదరాబాద్ పొలిటికల్ డిజైన్. అసెంబ్లీలో కోసీఆర్ మార్క్ ప్రాజెక్టుల గుట్టు విప్పి, పల్లెల్లో ప్రజాబలం ద్వారా ప్రజలను మమేకం చేయడం ఈ రెండెడ్ వ్యూహంఅదే సమయంలో, పల్లెబాట ద్వారా కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దే దిశగా కూడా అడుగులు పడుతున్నాయి. మంత్రివర్గంలో లేదా క్షేత్రస్థాయిలో ఉన్న చిన్నపాటి అసమ్మతి సెగలను అణచివేయడానికి, కేడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఈ పల్లెబాట ఒక పొలిటికల్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేయనుంది. స్థానిక సంస్థలు మరియు భవిష్యత్ ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలంటే స్వయంగా ముఖ్యమంత్రే గ్రౌండ్‌లోకి దిగి పర్యటించడం కంటే వేరే మార్గం లేదు. కేటీఆర్, హరీష్ రావు వంటి బిఆర్ఎస్ అగ్రనేతలు ప్రభుత్వంపై పదే పదే చేస్తున్న దాడిని ఎదుర్కొనేందుకు రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'డ్యూయల్ ఆపరేషన్' కాంగ్రెస్ పార్టీకి గట్టి రక్షణ కవచంగా మారనుంది. సచివాలయ పరిపాలనకు, గ్రామీణ ప్రజాక్షేత్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా ప్రజలు తమకు ఇబ్బంది వచ్చినప్పుడు ఆదుకునే నేతగా రేవంత్‌ను చూసే వాతావరణాన్ని కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్న 'ప్రజాబలం' పల్లెబాట తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు అసెంబ్లీ వేదికగా కాళేశ్వరంపై బీఆర్ఎస్ నెరేటివ్‌ను తిరగరాయడం, మరోవైపు పల్లెల్లో శ్రేణులను ఏకం చేస్తూ ప్రజామోదాన్ని పెంచుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణలో తన రాజకీయ స్థానాన్ని మరింత తిరుగులేనిదిగా మార్చుకోవడానికి సుదీర్ఘమైన స్కెచ్ వేశారు

డిసెంబర్ నుంచి డేంజర్ బెల్స్..!



హైదరాబాద్, :అప్పట్లో 2002 సంవత్సరం.. ఇప్పటికీ ఆ కరువు కరాళనృత్యం అందరి మదిలో ఉంది. తెలుగునాట తీవ్రమైన కరువొచ్చింది.. నీళ్ల కోసం బిందెలు సైకిళ్లకు కట్టుకొని పొలాల వద్దకు వెళ్లి మిగిలిన కాసిన్ని నీటిని తెచ్చుకొని జనాలు తమ అవసరాలు తీర్చుకున్న పరిస్థితి. అప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బిందెలు మోస్తూ వెళుతున్న దృశ్యాలే.... రైతులు అయితే పిట్టల్లా రాలారు. కరెంట్ లేక, తాగునీటి సౌకర్యం లేక జనాలు హరిగోస పడ్డారు. అంతటి తీవ్రమైన కరువు ఇప్పుడు ఎల్ నినోతో మరోసారి రాబోతోంది. ఈసారి హైదరాబాద్ మహానగరానికి అది పొంచి ఉంది. డిసెంబర్ నుంచే ఆ డేంజర్ బెల్స్ మోగనున్నాయి. హైదరాబాద్ ప్రజల గొంతులో ఇప్పుడు పచ్చి వెలక్కాయ పడింది. వేసవి దాహార్తి గురించి మనం ప్రతీ ఏడాదీ వింటూనే ఉంటాం.. కానీ ఈసారి వేసవి రావాల్సిన అవసరం కూడా లేదేమో అనిపిస్తోంది. చలికాలం ముగిసేలోపే అంటే సరిగ్గా డిసెంబర్ నెల నుంచే హైదరాబాద్‌కు 'కన్నీటి' కష్టాలు మొదలు కానున్నాయనే వార్త తెలంగాణ ప్రజలను.. ముఖ్యంగా నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు నిండుగా ప్రవహించే చెరువులు.. కుంటలతో కళకళలాడిన హైదరాబాద్ తాగునీటి వనరులు ఇప్పుడు బొట్టు నీటికి కూడా అల్లాడే పరిస్థితి దాపురిస్తోంది. హైదరాబాద్‌కు ప్రధానంగా తాగునీటిని అందించే సింగూరు.. మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు మునుపెన్నడూ లేనంతగా క్షీణించి పోతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ రిజర్వాయర్లలో నీటి మట్టం కేవలం 10 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందన్న జలమండలి అంచనాలు గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ నీటి సంక్షోభం ప్రభావం ప్రధానంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ సిటీలో భాగమైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, నార్సింగి, కోకాపేట వంటి ఐటీ హబ్‌లపై దారుణంగా పడనుంది. శేరిలింగంపల్లిలో ఏకంగా 80 శాతం.. జూబ్లీహిల్స్‌లో 50 శాతం వరకు నీటి సరఫరా నిలిచిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోజుకు సుమారు 10 కోట్ల గ్యాలన్ల నీటి లోటు ఏర్పడితే.. ఉదయాన్నే లేచి కుళాయి తిప్పితే చుక్క నీరు రాకపోతే.. పిల్లలను స్కూళ్లకు.. ఉద్యోగాలకు పంపే కుటుంబాల పరిస్థితి ఎంత నరకప్రాయంగా మారుతుందో ఊహించుకోవడానికే భయమేస్తోంది. రూ.కోట్లు వెచ్చించి కొనుక్కున్న ప్లాట్లు.. 40 అంతస్తుల విలాసవంతమైన ఫ్లాట్లు ఉన్నా.. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు లేకపోతే ఆ అభివృద్ధికి అర్థమేముంది? వందల అడుగులు తవ్వినా భూగర్భ జలాలు ఊరని పరిస్థితి నెలకొంటుంది.. రోజువారీ అవసరాల కోసం ట్యాంకర్ల వెంట బకెట్లతో పరుగులు తీయాల్సిన దుస్థితి వస్తే సామాన్యం.. మధ్యతరగతి కుటుంబాల బతుకులు మరింత భారమవుతాయి. కనీస అవసరమైన మంచి నీరు కూడా ఖరీదైన వ్యాపారంగా మారిపోకముందే.. ప్రభుత్వం, జలమండలి అధికారులు తక్షణమే స్పందించాలి. ప్రత్యామ్నాయ గోదావరి జలాల తరలింపు వేగవంతం చేసి.. లీకేజీలను అరికట్టి నగర దాహార్తిని తీర్చకపోతే.. నగరంలో వికాసం కాదు.. వినాశనమే మిగులుతుంది. ఎందుకంటే ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా.. ఎన్ని ఆకాశహర్మ్యాలు నిర్మించినా చివరకు మనిషికి కావాల్సింది గుక్కెడు మంచినీళ్లే..

ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ హైకమాండ్ సీక్రెట్ సర్వే



న్యూఢిల్లీ, : 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 2026 డిసెంబర్ నాటికి ప్రజా పాలనకు మూడేళ్లు పూర్తి అవుతుంది. దీంతో ప్రభుత్వ పనితీరు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి, పార్టీ క్షేత్రస్థాయి పరిస్థితులపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలుతోపాటు ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణ, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, ఎమ్మెల్యేల పనితీరు వంటి అంశాలను అంచనా వేయడంలో భాగంగా సర్వే చేయనున్నట్లు తెలుస్తోంది."కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రులు, ప్రజాప్రతినిధుల పనితీరు ఎలా ఉంది? కాంగ్రెస్? పాలనపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది? పరిష్కారం కాని సమస్యలు ఏమైనా ఉన్నాయా? ఒకవేళ ఉంటే వాటిని ఎందుకు పరిష్కారం చేయలేకపోతున్నారు" అనే తదితర అంశాలపైన వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సర్వేకు సంబంధించిన వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతున్నట్లు పార్టీకి చెందిన ఓ నాయకుడు తెలిపారు.క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నిర్వహిస్తున్న సర్వేలో ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో విజయం తర్వాత ఎమ్మెల్యేలు ప్రజలకు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారు? అభివృద్ధి పనుల పురోగతి ఎలా ఉంది? అనే అంశాలపై ప్రజల అభిప్రాయాన్ని తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. హామీల అమలు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు, అధికారులతో సమన్వయం, స్థానిక సమస్యలపై స్పందన ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేయనున్నట్లు తెలుస్తోంది."ప్రజల్లో ఎన్నికలకు ముందు ఆయా నాయకులపై ఉన్న ఆదరణకు, ఇప్పుడు ఉన్న అభిప్రాయానికి మధ్య తేడా ఎంత? ఏ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది? ఎక్కడ సంతృప్తి ఉంది?" అనే అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. "ప్రజలకు ఎమ్మెల్యేలు సమయం కేటాయిస్తున్నారా? అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తున్నారా?" అనే అంశాల్లో వారి పనితీరును అంచనా వేయడంలో ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు సమాచారం.కాంగ్రెస్‌లో అంతర్గత సమన్వయం కూడా మరో కీలక అంశంగా కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు ప్రజాప్రతినిధుల వ్యవహారశైలిలో మార్పులు వచ్చాయనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉన్నాయి? సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తోందా? లేక బయట పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారా? అనే అంశాలపై సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యేలు ఎలా వ్యవహరిస్తున్నారు? స్థానిక నాయకుల మధ్య సమన్వయం ఉందా? ఎక్కడైనా వర్గ విభేదాలు పార్టీ బలోపేతానికి అడ్డంకిగా మారుతున్నాయా? అనే అంశాలను పరిశీలించే అవకాశం ఉంది.రాష్ట్రంలోని నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, నవంబర్ నెలాఖరుకు సమగ్ర నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో సునీల్ కనుగోలు బృందం పనిచేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ గడువుపై అధికారికంగా స్పష్టత లేదు. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలన పూర్తి చేసుకోనున్నందున ఈ నివేదికకు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

కరువు మండలాల్లో రుణాల వసూళ్లకు బ్రేక్

హైదరాబాద్, : తెలంగాణలో కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు భారీ ఊరట లభించనుంది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మండలాల్లో రైతులు తీసుకున్న పాత రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేయాలని నిర్ణయించింది. అంతేకాదు.. రుణాలు తిరిగి చెల్లించేందుకు రైతులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు గడువు కల్పించనుంది. దీంతో అప్పుల చెల్లింపుల విషయంలో రైతులకు కొంత ఉపశమనం లభించనుంది.రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనకు బ్యాంకర్లు కూడా సూత్రప్రాయంగా అంగీకరించారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకర్లతో మాట్లాడారు. కరువు కారణంగా పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి ప్రస్తుతం ఉన్న రుణాలను వెంటనే వసూలు చేయకుండా మారటోరియం అమలు చేయాలని కోరారు. అలాగే రానున్న రబీ సీజన్‌లో సాగు పనుల కోసం రైతులకు కొత్త రుణాలు కూడా ఇవ్వాలని సూచించారు.బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఓ మోస్తరు కరువు ఉన్న 254 మండలాల్లో రైతుల రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేస్తారు. ఈ రుణాలను తిరిగి చెల్లించేందుకు రైతులకు 36 నెలల గడువు కల్పిస్తారు. అంటే మూడేళ్లలోపు రుణాలను చెల్లించాల్సి ఉంటుంది. అదే తీవ్ర కరువు పరిస్థితులు ఉన్న 111 మండలాల్లోనూ 12 నెలల పాటు రుణాల వసూళ్లు నిలిపివేస్తారు. అయితే ఈ మండలాల రైతులకు రుణాల చెల్లింపునకు 60 నెలల గడువు ఇవ్వనున్నారు. అంటే ఐదేళ్లలోపు రుణాలు తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది.మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మారటోరియం కోసం రైతులు ప్రత్యేకంగా ముందుకొచ్చినా, రాకపోయినా బ్యాంకులే అర్హులైన రైతులను గుర్తించి ఉపశమన చర్యలు చేపట్టనున్నాయి. రైతుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అర్హులకు మారటోరియం అమలు చేయడంతో పాటు రబీ సీజన్‌కు కొత్త రుణాలు కూడా మంజూరు చేయనున్నారు.ఫామ్‌లు అన్వేషించండిమారటోరియం అమలయ్యే 12 నెలల కాలానికి రైతుల రుణాలపై పడే వడ్డీ భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆ వడ్డీని రాయితీ రూపంలో సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనుంది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల వివరాలను 15 రోజుల్లోగా రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సీఐఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర బ్యాంకర్ల సమావేశం నిర్ణయించింది.

మరో ఉద్యోగితో రిలేషన్..
జేన్సన్ హువాంగ్‌పై వేటుకు ఎన్వీడియో బోర్డు సిద్ధం

న్యూఢిల్లీ: అమెరికా చిప్ తయారీ కంపెనీ ఎన్వీడియా సీఈవో జేన్సన్ హువాంగ్‌పై చర్యలు తీసుకునేందుకు ఆ కంపెనీ బోర్డు సిద్దమైనట్లు ఓ నివేదిక ద్వారా వెల్లడైంది. చైనీస్ గూఢాచారితో పాటు మరో మహిళతోను సీఈవో జేన్సన్ వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. త్వరలోనే కంపెనీ బోర్డు సభ్యులు సమావేశం కానున్నారని ఆ నివేదికలో వెల్లడైంది. ఒకవేళ హువాంగ్‌ను తప్పిస్తే, అప్పుడు సుమారు 4 ట్రిలియన్ల డాలర్ల చిప్ తయారీ కంపెనీ భవితవ్యం అగమ్యగోచరంగా మారనున్నది. జేన్సన్ అఫైర్ వార్తలు బయటకు పొక్కడంతో ఆ కంపెనీ షేర్లు అమాంతం 8 శాతం పడిపోయాయి. ఈ వారంలోనే ఆ కంపెనీ సుమారు 600 బిలియన్ల మార్కెట్ విలువను కోల్పోయింది. హువాంగ్‌ను తక్షణమే తొలగించలేని పరిస్థితిలో ఆ కంపెనీ ఉన్నది. ఎందుకంటే ఆయనకు వారసుడిగా ఎవర్ని ప్రకటించాలన్న దానిపై ఇంకా క్లారిటీ లేదు. ఒకవేళ కంపెనీ విధానాలను కానీ, చట్టాలను కానీ హువాంగ్ ఉల్లంఘించినట్లు రుజువైతే, దానికి తగిన ఆధారాలు ఉంటే, ఆయనపై చర్యలు తీసుకుంటామని టెక్నాలజీ రీసర్చ్ హెడ్ గిల్ లూరియా తెలిపారు. చైనీస్ గూఢాచారిణి అలిస్ హువాంగ్‌తో పాటు కంపెనీలో పనిచేసే ఓ ఎగ్జిక్యూటివ్ మహిళతోనూ హువాంగ్ రిలేషన్‌లో ఉన్నట్లు ఊహాగానాలు వ్యాపించాయి. ఎన్వీడియా హెల్త్‌కేర్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా చేస్తున్న కింబర్లే పావల్‌తో జేన్సన్ రిలేషన్‌లో ఉన్నట్లు అమెరికా మీడియా తెలిపింది. దీనిపై వ్యక్తిగతంగా ఇద్దరూ స్పందించలేదు. అయితే తాజా ఆరోపణల నేపథ్యంలో జేన్సన్‌పై వేటుకు బోర్డు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

టీడీపీలో రాయలసీమ రెడ్డమ్మలు

తిరుపతి, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మహిళా నాయకత్వం తనదైన ముద్ర వేస్తోంది. ముఖ్యంగా అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీలో మహిళా నేతల చురుకైన పాత్ర ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన మహిళా నాయకులు తమ నియోజకవర్గాలకే పరిమితం కాకుండా పార్టీ విస్తరణ, కేడర్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎన్నికల నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, స్థానిక నాయకులతో సమన్వయం వంటి అంశాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. తాజాగా జరిగిన మున్సిపల్ , ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ వీరి రాజకీయ కార్యాచరణ స్పష్టంగా కనిపించింది.కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి రెడ్డి తాజా ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కడప కార్పొరేషన్‌తో పాటు నియోజకవర్గ పరిధిలో పార్టీ బలాన్ని పెంచుకునేందుకు ప్రత్యేకంగా పనిచేశారు. స్థానికంగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచడం వంటి అంశాలపై దృష్టి సారించారు. ప్రత్యర్థి వైసీపీ నాయకుల రాజకీయ వ్యూహాలను ఎదుర్కొనే విషయంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించారు. తన నియోజకవర్గంలో పార్టీ పట్టు కొనసాగించడంతో పాటు భవిష్యత్తు ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగారు.మరోవైపు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి సంజీవరెడ్డిగారి సవిత కూడా ఎన్నికల సమయంలో ప్రత్యేక చొరవ చూపించారు. రాజకీయంగా దూకుడైన వ్యాఖ్యల కంటే ప్రజలతో సంబంధాలు కొనసాగించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ఆమె ఎక్కువగా దృష్టి పెట్టారు. కూటమి అభ్యర్థుల విజయానికి స్థానిక నాయకులతో కలిసి పనిచేశారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడం ద్వారా పార్టీకి అనుకూల వాతావరణం కల్పించే ప్రయత్నం చేశారు. ఆమె చొరవతో పలు మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు మంచి ఫలితాలు సాధించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తి సుధా రెడ్డి పేరు కూడా ఎన్నికల సమయంలో ప్రముఖంగా వినిపించింది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని భార్యగా రాజకీయ వర్గాలకు పరిచయమైన ఆమె, పోలింగ్ సమయంలో మంగళం కేంద్రం వద్ద చురుగ్గా వ్యవహరించారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కదలికలను గమనిస్తూ, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ పరిణామాలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉన్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా తాను కూడా అనుసరిస్తానని, ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తానని చెప్పడం అప్పట్లో రాజకీయంగా చర్చకు దారితీసింది. ఎన్నికల ఏజెంట్‌గా వ్యవహరిస్తూ పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితులను పర్యవేక్షించారు.ఈ ముగ్గురు నాయకురాళ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో టీడీపీకి చెందిన మహిళా నాయకులు కూడా ఎన్నికల ప్రచారం, క్షేత్రస్థాయి సమన్వయం, ఓటర్లను కలవడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం కేడర్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. రాజకీయాల్లో మహిళలు కేవలం ప్రాతినిధ్యానికే పరిమితం కాకుండా ఎన్నికల వ్యూహాలు, పార్టీ నిర్వహణలోనూ కీలక బాధ్యతలు చేపడుతున్నారనే విషయాన్ని తాజా పరిణామాలు మరోసారి చాటుతున్నాయి. రాబోయే రోజుల్లో టీడీపీలో మహిళా నాయకత్వం ఇంకెంత విస్తరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది చంద్రగిరిలో పులవర్తి నాని కుటుంబానికి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబానికి మధ్య చాలాకాలంగా రాజకీయ పోటీ కొనసాగుతోంది. ఇరు వర్గాల మధ్య గతంలో పలుమార్లు తీవ్ర ఉద్రిక్తతలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పులివర్తి నానిపై జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న దాడి ఘటన రాజకీయంగా పెద్ద వివాదానికి దారితీసింది. అప్పటి నుంచి ఇరు వర్గాల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. అలాంటి పరిస్థితుల్లో తాజాగా జరిగిన పరిణామం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.చిత్తూరు జిల్లాలో జరుగుతున్న మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నేపథ్యంలో చెవిరెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు బయలుదేరారు. రాజకీయంగా తీవ్ర విభేదాలున్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఇవ్వాలనే సందేశాన్ని ఆమె తన మాటల ద్వారా తెలియజేశారు. పోలింగ్ సమయంలో ఎలాంటి ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా అందరూ సంయమనంతో వ్యవహరించాలని చెవిరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆమె చేసిన ప్రతిపాదన మరింత ఆసక్తికరంగా మారింది.

సాయి రెడ్డి పీఆర్‌పీ..గమ్మత్తులు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి పరివర్తన రాజనీతి పార్టీ(పీఆర్‌పీ) పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పార్టీ పేరు, జెండా మరియు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. విజయసాయిరెడ్డి కొత్త పార్టీకి సంబంధించిన ప్రసంగం ఎలా ఉన్నా.. ముఖ్య విశేషాలు మాత్రం చాలా గమ్మత్తుగా ఉన్నాయని అంటున్నారు పరిశీలకులు. పేరు నినాదం. పార్టీ పూర్తి పేరు పరివర్తన రాజనీతి పార్టీ కాగా, "దేశం కోసం, ధర్మం కోసం" అనే నినాదంతో దీనిని ఏర్పాటు చేశారు. గతంలో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీకి ఉన్న 'పీఆర్‌పీ' సంక్షిప్త నామాన్నే తన కొత్త పార్టీకి ఎంచుకోవడం విశేషం. అంతేకాదు.. నాడు చిరు.. కూడా ఇలానే సామాజిక న్యాయం పేరుతోనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం గమనార్హం. జెండా ఆకృతి. పార్టీ జెండాను తెలుపు, కాషాయ రంగుల కలయికతో రూపొందించారు. జెండా మధ్యలో బంగారు వర్ణపు ధర్మచక్రం గుర్తును ఉంచారు. ఇది పూర్తిగా కేంద్రంలోని బీజేపీ అనుసరించే కాషాయ జెండాను పోలి ఉందన్న మిమ్స్ పడుతున్నాయి. సాయిరెడ్డి కూడా టీడీపీ, వైసీపీలపైనే విమర్శలు గుప్పించారు తప్ప.. ఎక్కడా జాతీయ పార్టీలను కార్నర్ చేయకపోవడం గమనార్హం. 2029 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాల్లోనూ తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని సాయిరెడ్డి స్పష్టం చేశారు. ఏ ఇతర పార్టీకి 'బీ టీమ్'గా ఉండబోమని తేల్చిచెప్పారు. అయితే.. కొత్తగా పుట్టిన పార్టీకి రెండేళ్లలోనే అంత శక్తిసామర్థ్యాలు ఉన్నాయా? అనేది కీలకం. రాష్ట్రంలో రెండు కుటుంబాల రాజకీయ ఆధిపత్యానికి చరమగీతం పాడటమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కానీ, సాయిరెడ్డి కుటుంబం నుంచి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొనడం గమనార్హం. యువతకు 66% ప్రాధాన్యత. సామాజిక న్యాయమే లక్ష్యంగా కుల, మత భేదాలకు అతీతంగా యువతకు రాజకీయాల్లో 66 శాతం అవకాశాలు, టికెట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అంతేకాదు.. మెంటార్‌గా మాత్రమే బాధ్యతలు తీసుకుంటానని, తనకు ముఖ్యమంత్రి పదవిపై ఎలాంటి ఆశ లేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. పార్టీకి తాను కేవలం ఒక కన్వీనర్ లేదా మెంటార్‌గా మాత్రమే వ్యవహరిస్తూ, సమర్థులైన యువతను నాయకులుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. రాష్ట్రంలోని దేవాలయాల పాలక మండళ్లు రాజకీయ నిరుద్యోగులకు ఆవాస కేంద్రాలుగా మారాయని ఆయన విమర్శించారు. దేవుడిపై నిజమైన భక్తి, విశ్వాసం ఉన్నవారికే ఆలయ కమిటీల్లో స్థానం కల్పించాలని, మతపరమైన అంశాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోకూడదని అభిప్రాయపడ్డారు. తద్వారా ఆయన బీజేపీ అజెండాను అనుసరిస్తారా? అని నెటిజన్లు కామెంట్లు చేయడం గమనార్హం. వైసీపీ కార్యకర్తలకు ఆహ్వానం. ప్రజలకు సేవ చేయాలనే నిజమైన ఆసక్తి ఉన్న వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి, పరివర్తన రాజనీతి పార్టీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాదు.. వైసీపీలో ఉండి ఎలాంటి గుర్తింపు లేకుండా పోయిన వారికి తాను గుర్తింపు ఇస్తానని కూడా ప్రకటించడం గమనార్హం. తద్వారా.. ఆయన వైసీపీకి గేలం వేసినట్టే కనిపిస్తోంది.

పార్టీ పేరు వెనుక కథ....

నెల్లూరు, : మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి కొత్త పార్టీని ప్రకటించారు. అయితే ఈ పార్టీ పేరును పీఆర్పీ అని ప్రకటించడానికి కారణాలేంటి? అన్న దానిపై రాజకీయంగా లోతైన చర్చ జరుగుతుంది. నేడు విజయవాడలో తన కొత్త రాజకీయ పార్టీని పరివర్తన రాజనీతి పార్టీ పేరుతో ప్రకటించారు.పార్టీకి ఈ పేరు పెట్టడానికి మరియు పార్టీ స్థాపనకు సంబంధించి ఆయన వెల్లడించిన ప్రధాన కారణాలు అనేకం ఉన్నట్లు కనపడుతున్నాయి. షార్ట్ కట్ లో పీఆర్పీ అని జనంలోకి వెళితే సులువుగా చేరుకుంటామని విజయసాయిరెడ్డి అంచనా వేసినట్లు కనపడుతుంది. గతంలో మెగాస్టార్ చిరంజీవి ప్రరాజ్యం పార్టీ పేరును కూడా పీఆర్పీగా పిలిచేవారు. అదే పేరును షార్ట్ కట్ లో పిలుస్తూ జనంలోకి ఎంత దూరం వెళతారన్నదే ఇప్పుడు అసలైన ప్రశ్న. . పీఆర్పీ అంటే రాజకీయ పరివరన పార్టీ అని అర్థమని ఆయన చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనే ఆలోచనకు ప్రాధాన్యతని స్తూ పార్టీ పేరులో 'పరివర్తన' అనే పదాన్ని చేర్చారు. కేవలం అధికార మార్పిడి కోసం కాకుండా ప్రజాసమస్యల పరిష్కారం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే తమ ధ్యేయమని విజయసాయిరెడ్డి తెలిపారు. దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొనసాగుతున్న రెండు ప్రధాన పార్టీలు, కుటుంబ పాలన, కుల-మత ఆధారిత రాజకీయాలకు ప్రత్యామ్నాయం గా బలమైన మూడో శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. పార్టీ పేరును ప్రకటించే సమయంలో సాయిరెడ్డి ఇటు అధికార పార్టీపైన, అటు విపక్ష వైసీపీ పైన విమర్శలు చేశారు. చంద్రబాబు, జగన్ ల పేరు ఎత్తి మరీ ఆ రెండు కుటుంబాలే రాష్ట్రానికి నాయకత్వం వహిస్తున్నాయన్నారు. కానీ పవన్ కల్యాణ్ పేరు ఊసు తేకపోవడం కొత్త సందేహాలకు తావిస్తుంది. రాజకీయాల్లో కొత్త తరానికి, సామర్థ్యం ఉన్న నాయకులకు అవకాశం కల్పించేలా యువతకు 60 శాతం అవకాశాలు ఇస్తామని తెలిపారు. పీఆర్పీ ఏ పార్టీకి బీ టీం కాదని తెలిపారు. తాను రాజకీయ పార్టీ పెడుతున్నానని ప్రకటించిన వెంటనే వైసీపీ సోషల్ మీడియాలో చంద్రబాబు పెట్టించిన పార్టీ అని, టీడీపీ సోషల్ మీడియా జగన్ కు బీ టీంగా ఇది ఏర్పడిందని విమర్శలు చేస్తున్నారని, కానీ తాను వెంకటేశ్వరస్వామి పై ఒట్టేసి చెబుతున్నానని, ఎవరికీ బీ టీం గా తమ పార్టీ వ్యవహరించదని తెలిపారు. దేశభక్తి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణ అనే మూడు సూత్రాల ఆధారంగా పార్టీ పనిచేస్తుందని విజయసాయి రెడ్డి స్పష్టం చేశారు. గతంలో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ నినాదాన్ని గుర్తుచేస్తూ, అదే ఖఖీఖ సంక్షిప్త నామంతో వచ్చిన ఈ పార్టీ పేరు హాట్ టాపిక్ అవుతోంది.తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండింటికీ ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో బలమైన మూడో శక్తిగా'గా తమ పార్టీ రూపుదిద్దుకుంటుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. సాంప్రదాయ కుటుంబ పాలన, కుల-మత ఆధారిత రాజకీయాలు మరియు దాడుల సంస్కృతిని తీవ్రంగా తప్పుపట్టిన ఆయన.. తమ పార్టీ జెన్-జీయువతను, సామర్థ్యం ఉన్న నాయకులను తయారు చేసే ఫ్యాక్టరీలా పనిచేస్తుందని వెల్లడించారు. తాను పార్టీకి కన్వీనర్ లేదా మెంటార్‌గా మాత్రమే వ్యవహరిస్తానని, ముఖ్యమంత్రి పీఠాన్ని ఆశించడం లేదని పేర్కొంటూ సామర్థ్యం ఉన్నవారికే నాయకత్వ పగ్గాలు ఇస్తామని ఇప్పటికే హామీ ఇచ్చారు.ఉచిత విద్యుత్, ఉపాధి కల్పన, ఆర్థిక క్రమశిక్షణతో పాటు 80 ఏళ్లుగా నెరవేరని ప్రజల ఆకాంక్షలను తీర్చడమే ధ్యేయంగా తమ ఎజెండా ఉంటుందని సాయిరెడ్డి వెల్లడించారు. విజయవాడతో పాటు విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం నగరాల్లో కూడా సభలు నిర్వహించి పార్టీ భావజాలాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దశాబ్దాల పాటు వైసీపీలో అత్యంత కీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి ఇప్పుడు సొంతంగా పీఆర్పీ జెండా ఎగరేయడం ఏపీ రాబోయే రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది వేచి చూడాలి.అయితే పేరు పెట్టడం ఒక మార్గంలో సాయిరెడ్డి వెళ్లారంటుంటే, అదే సమయంలో 11వ తేదీ 11.30 గంటలకు పార్టీ పేరును ప్రకటించడం కూడా మరొకరకమైన ఎత్తుగడ అని చెబుతున్నారు. మొత్తం మీద సాయిరెడ్డి పార్టీ ఏం సాధిస్తుందన్నది కాలమే తేల్చనుంది.

నమ్మనొళ్లే..ముంచేస్తున్నారే?



విజయవాడ: ప్రజాస్వామ్య రాజకీయాల్లో విధానపరమైన సిద్ధాంతాలతో ప్రత్యర్థులు ఉండటం సర్వసాధారణం. కానీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే.. ఆయనకు కేవలం బయటి పార్టీలతోనే కాదు, తన సొంత రక్తసంబంధీకులతోనూ తీవ్రమైన వ్యక్తిగత వైరం ఉండటం ఒక వింతైన, విషాదకరమైన పరిణామం. జగన్ రెడ్డి ఎదుగుదల వెనుక, ఆయన కష్టకాలంలో జైల్లో ఉన్నప్పుడు, అధికారం సాధించే వరకు నిస్వార్థంగా పోరాడిన వ్యక్తులే కాలక్రమంలో ఆయనకు బద్ధశత్రువులుగా మారిపోయారు. కన్నతల్లి విజయమ్మ, వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి పార్టీ జెండాను మోసిన సొంత చెల్లి షర్మిల, బాబాయ్ వివేకానందరెడ్డి కుటుంబం.. చివరకు నాలుగు దశాబ్దాలుగా వైఎస్ కుటుంబానికి ఆర్థిక, రాజకీయ మూలస్తంభంగా నిలిచి పార్టీలో నంబర్-2గా చక్రం తిప్పిన రైట్ హ్యాండ్ విజయసాయిరెడ్డి సైతం నేడు జగన్‌కు ఎదురుతిరిగి సొంత దుకాణం పెట్టుకునే స్థాయికి చేరారంటే సమస్య ఎక్కడుందనేది స్పష్టమవుతోంది.ఈ విపరిణామాలకు ప్రధాన కారణం జగన్ వ్యక్తిత్వంలోని అపరిమితమైన స్వార్థం, ఏకపక్ష అహంభావ ధోరణి అని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఆయన రాజకీయాల్లో వ్యక్తులకంటూ ఇచ్చే విలువ సున్నా. కేవలం తన అధికార దాహం, ప్యాలెస్ ప్రయోజనాల కోసం ఎదుటివారిని వాడుకుని వదిలేసే సంస్కృతిని అనుసరించడమే ఇందుకు నిదర్శనం. తండ్రి వైఎస్ఆర్ సంపాదించిన ఆస్తులను నలుగురు మనవళ్లు, మనవరాళ్లకు సమంగా పంచాలని కన్నతల్లి విజయమ్మ బహిరంగ లేఖలు రాసినా, చెల్లి షర్మిల వీధుల్లో నిలబడి న్యాయం కోరినా.. చివరకు వారిపైనే ఎన్సీఎల్‌టీ కోర్టుల్లో కేసులు వేసి, సోషల్ మీడియా మూకలతో నీచమైన విమర్శలు చేయించిన ఘనత జగన్‌కే దక్కుతుంది. తన కుటుంబ మహిళలకే కనీస న్యాయం, గౌరవం ఇవ్వని ఒక నాయకుడు.. బయటి సమాజానికి, ప్రజాస్వామ్యానికి ఏమి న్యాయం చేస్తాడన్న ప్రశ్న ప్రజల హృదయాల్లో బలంగా నాటుకుపోయింది. కుటుంబసభ్యుల తర్వాత రాజకీయంగా జగన్‌కు అత్యంత నమ్మకస్తులైన నాయకుల జాబితాను చూసినా ఇదే వరుస కనిపిస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టినప్పటి నుంచి జగన్‌తో పాటు జైలు జీవితం గడిపి, ఢిల్లీ లాబీయింగ్ నడిపి, పార్టీ వ్యవస్థాపనలో కీలకపాత్ర పోషించిన విజయసాయిరెడ్డి సైతం నేడు పార్టీని వీడి కొత్త రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడాల్సి రావడం తాడేపల్లి నాయకత్వ డొల్లతనాన్ని బట్టబయలు చేస్తోంది. గతంలో పార్టీకి కొండంత అండగా నిలిచిన మేనమామలు, వివేకా కుమార్తె సునీత, బాలినేని శ్రీనివాసరెడ్డి, రఘురామకృష్ణంరాజు వంటి ఎందరో కీలక నాయకులు జగన్ తీరుతో విసిగిపోయి బయటకు వచ్చారు. తనను ప్రశ్నించే అధికారం ఎవరికీ ఉండకూడదన్న ఒంటెద్దు పోకడ, ఎంతటి విధేయులనైనా అనుమానించే 'పారానోయియా' మనస్తత్వమే చుట్టూ ఉన్న ఆత్మీయులసందరినీ బద్ధ శత్రువులుగా మార్చేసింది.ఇంత జరుగుతున్నా, అధికారం కోల్పోయి పార్టీ అగాధంలో పడిపోయినా.. అందరూ నన్నే ఎందుకు పదిలేస్తున్నారు? నా లోపం ఎక్కడ ఉంది? అని జగన్ రెడ్డి ఒక్కసారైనా అంతర్మథనం చేసుకున్నారా అంటే లేదు అనేదే నిర్ద్వంద్వమైన సమాధానం. తప్పుల నుంచి నేర్చుకోవడం జగన్ నిఘంటువులోనే లేదు. ఎవరైనా విడిపోతే వారిపై కక్షసాధింపు చర్యలకు దిగడం, పెయిడ్ సోషల్ మీడియా ద్వారా వారి క్యారెక్టర్ అస్సాసినేషన్ చేయించడం, వారిని చంద్రబాబు కోవర్టులు గా ముద్రవేయడమే జగన్ పరిష్కార మార్గం. తన స్వార్థం, అవినీతి కేసుల భయం, ప్యాలెస్ అహంకారం వల్లనే సొంత రక్తసంబంధీకులు కూడా తనను ఛీత్కరించుకుంటున్నారన్న నిజాన్ని అంగీకరించే మానసిక పరిపక్వత ఆయనకు లేకపోవడమే ఆయన వ్యక్తిత్వంలోని అసలైన లోపం.రాజకీయాల్లో నాయకుడికి ప్రజల మద్దతు ఎంత అవసరమో.. అంతర్గతంగా కుటుంబం, నమ్మకమైన మిత్రుల అండ అంతకంటే అవసరం. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్ వంటి ఎందరో సమకాలీన నాయకులను చూస్తే.. కుటుంబం ఒక రక్షణ కవచంలా వెన్నంటి నిలిచింది. కానీ జగన్ విషయంలో మాత్రం ఇంటిల్లిపాదీ రోడ్డెక్కి ఆయనకు వ్యతిరేకంగా పోరాడటం భారత రాజకీయ చరిత్రలోనే ఒక అరుదైన విషాదం. సొంత రక్తానికే విశ్వాసం చూపని నాయకుడిని.. ప్రజాక్షేత్రంలో నాయకులు, ఓటర్లు ఎలా నమ్ముతారన్నది అసలు ప్రశ్న. ఆత్మపరిశీలన చేసుకోకుండా, అందరినీ శత్రువులుగా మార్చుకుంటూ పోతున్న ఈ వికృత వైఖరే చివరకు జగన్ మోహన్ రెడ్డిని రాజకీయంగా ఒంటరివాడిని చేసి, మూలన కూర్చోబెట్టడం ఖాయం.

ఎక్కడ అమలు కాని జగన్ వ్యూహాలు!

గుంటూరు : వైసీపీఅధినేత వైఎస్ జగన్ కార్యకర్తలను దగ్గరకు తీసుకోవడం లేదు. అసలు వారిని గురించి పట్టించుకోవడం లేదు. కేవలం సమావేశాల్లో ప్రసంగాల్లో తప్ప ఆయన స్వయంగా కార్యకర్తల తో సమావేశం నిర్వహించిన పాపాన పోలేదని వాపోతున్నారు. పార్టీ కోసం ఏమీ ఆశించకుండా పోరాడుతున్న కార్యకర్తలను అధికారంలో ఉన్నప్పుడు అంతే. లేనప్పుడు కూడా తీరు మారకపోవడాన్ని కొందరు తీవ్రంగా తప్పుపడుతున్నారు. మరొకవైపు వైసీపీ కోసం సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలను నిర్వహించలేదు. ప్రధాన మీడియాకు పోటీగా కార్యకర్తలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియా కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడుతున్నా వారిని గుర్తించడం లేదని, కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వకపోవడమేంటని వైఎస్ జగన్ ను కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. కార్యకర్తల బీమా పథకాన్నికూడా అమలు చేయడం లేదు. కానీ నిన్న గాక మొన్న వచ్చిన పార్టీలు కూడా బీమా సౌకర్యాలను కల్పిస్తుంటే పార్టీ పెట్టి ఇన్నేళ్లవుతున్నా పట్టించుకోకపోవడాన్ని బట్టి జగన్ కు క్యాడర్ పట్ల ఎంత మమకారం ఉందో అర్థమవుతుందని తెలిపారు. పెట్టుబడి దారులకు రక్షణ చట్టం స్వచ్ఛందంగా పనిచేస్తున్న వారిని... వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ సోషల్ మీడియా విభాగంతో సమావేశం నిర్వహించారు. కానీ వారంతా డబ్బులు తీసుకుని పనిచేసేవారని, అయితే స్వచ్ఛందంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ పై అభిమానంతో కష్టపడుతున్న వారిని మాత్రం గుర్తించడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి తదితర నేతల ఆధ్వర్యంలో సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం జరిగిందని, అంతే తప్ప జగన్ ఇందులో పాల్గొనకపోవడాన్ని కూడా తప్పుపట్టింది. 2024న విశాఖపట్నం జిల్లా పెదిపాలెంలోని చెన్నాస్ కన్వెన్షన్ హాల్‌లో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జగన్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎక్కడని ప్రశ్నిస్తున్నారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా వర్కర్లతో ప్రత్యేకంగా ఎక్కడెక్కడ సమావేశాలు నిర్వహిస్తారనే పూర్తి షెడ్యూల్ వివరాలు అందుబాటులో లేవు. ఎంత సేపటికి నియోజకవర్గాల ఇన్ ఛార్జులతోనే సమావేశమవుతున్నారని, పార్టీ గెలుపునకు కష్టపడే వారికి గుర్తింపు దక్కడం లేదని అంటున్నారు. కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పిస్తామని జగన్ ప్రకటన కూడా ఆచరణలో సాధ్యం కావడం లేదని కొందరు సోషల్ మీడియా వేదికగా వాపోతున్నారు. నాడు జగన్ ఏదైనా అనుకోని ఘటనలోనో, ప్రమాదవశాత్తూ మరణించిన వైసీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ తరపున రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లుఈ ఏడాది సెప్టంబరు లో వైఎస్ జగన్ ప్రకటించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 1, 2026 నుంచి అమల్లోకి వస్తుందని పార్టీ పేర్కొంది. ఆర్థిక సాయం పొందేందుకు పార్టీ జారీ చేసిన ఐడి కార్డులు మరియు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని చెప్పింది.

వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో మాయం..!?

ఒంగోలు: వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో రూ.కోట్ల విలువైన భూములను అనధికారికంగా ఇతరుల పేరిట మార్చేస్తున్న ఒక ముఠా గుట్టును సీఐడీ విభాగం విజయవంతంగా రట్టు చేసింది. నేషనల్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్‌కి చెందిన ఓ సీనియర్ అధికారి లాగిన్ క్రెడెన్షియల్స్‌ను అక్రమంగా వాడుతూ డేటాబేస్‌ను తారుమారు చేస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముఠా సుమారు రూ.50 లక్షలు వసూలు చేసి 70 ఎకరాలకు పైగా భూమి రికార్డులను మార్చినట్లు తేలింది.ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఇండ్లచెరువు, పడమరలక్ష్మీపురం గ్రామాల పరిధిలోని 6.65 ఎకరాల భూమికి సంబంధించి వెబ్‌ల్యాండ్ రికార్డుల్లోఅనది కారిక మార్పులు జరిగినట్లు సీసీఎల్ఏ అధికారులు గుర్తించారు. ఈ అక్రమాలపై సీసీఎల్ఏ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీఐడీ ఈ స్కామును బయటపెట్టింది.పడమ రలక్ష్మీపురం గ్రామానికి చెందిన వడ్లమూడి ఏడుకొండలు అనే వ్యక్తి తన కుటుంబ భూములను తండ్రి వడ్లమూడి వెంకటేశ్వర్లు పేరిట మార్చేందుకు ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నాడు.

ఏడుకొండలు మొదట తన బంధువు గుండపనేని వెంకటేశ్వర్లును సంప్రదించగా.. ఆయన ద్వారా పురపాలక శాఖ కమిషనరేట్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వేముల వెంకటరావు వరి చయమయ్యాడు. వెంకట్ ద్వారా అన్న క్యాంటీన్ ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్ షేక్ బాషా, ఆయన ద్వారా విజయవాడ ఎన్ఐసీలో జూనియర్ డెవలపర్‌గా పనిచేస్తూ వెబ్‌ల్యాండ్ యాక్సెస్ ఉన్న రంగయ్యగారి సాయికుమార్ ఈ కుట్రలో భాగస్వాములయ్యారు. ఏడుకొండలు చెప్పిన భూముల వివరాలను వెంకట్, బాషాల ద్వారా సాయికుమార్‌కు చేరవేసి రికార్డుల్లో మార్పులు చేయించేవారు.ఎన్ఐసీ సీనియర్ అధికారి జీవీఎస్ఆర్ శర్మకు తెలియకుండా ఆయన లాగిన్ వివరాలను వాడిన సాయికుమార్.. తహసీల్దార్ ఆఫీసు ఆమోదం, మ్యుటేషన్ ప్రొసీడింగ్స్ వంటి ఎలాంటి రెవెన్యూ ప్రక్రియలు లేకుండానే ఆన్‌లైన్ రికార్డుల్లో కొత్త పట్టాదారుల పేర్లు ప్రత్యక్షమయ్యేలా చేశాడు. ఈ అక్రమాలకు గాను సాయికుమార్‌కు బాషా భార్య అమీనా ఖాతా నుంచి ఆగస్టులో రూ.50 వేలు, సెప్టెంబరులో రూ.25 వేలు జమ అయినట్లు సీఐడీ ఆధారాలు సేకరించింది.ఈ ట్యాంపరింగ్ కేవలం ఒక కుటుంబానికే పరిమితం కాకుండా మొత్తం 30 రికార్డుల్లోని 70 ఎకరాల భూములకు పాకింది. వీటి మార్కెట్ విలువ రూ.కోట్లలో ఉంటుంది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన సూత్రధారులు వడ్లమూడి ఏడుకొండలు, రంగయ్యగారి సాయికుమార్, వేముల వెంకటరావు, షేక్ బాషాలను సీఐడీ అరెస్టు చేసింది. ఈ స్కాము ద్వారా లబ్ధి పొందిన ఇతరులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

విజయసాయిరెడ్డి రాజకీయ పార్టీ.. వైసిపికి నష్టమేనా..?

నెల్లూరు, : వైసిపి మాజీ నాయకుడు.. విజయసాయిరెడ్డి తన కొత్త పార్టీని ప్రకటించారు. పరివర్తన రాజనీతి పార్టీ అంటూ దానికి పేరు పెట్టారు. జెండాను కూడా ఆవిష్కరించారు. దేశభక్తి..

ఓపో ఎఫ్35 సిరీస్‌ను విడుదల...



భారతదేశంలో ఎఫ్ సిరీస్ ప్రారంభమై 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఓపో ఓపో ఎఫ్35 ప్రో,
ఓపో ఎఫ్35 మోడళ్లతో కూడిన ఓపో ఎఫ్35 సిరీస్ విడుదలను ప్రకటించింది. గత దశాబ్ద కాలంలో, మొదటి తరం ఎఫ్1తో "సెల్ఫీ నిపుణుడు"గా ప్రారంభమైన ఎఫ్ సిరీస్, కొత్త ఎఫ్35 సిరీస్‌తో "గ్రూప్ సెల్ఫీ నిపుణుడు"గా ఎదిగింది.
వినియోగదారులు తమ మధుర క్షణాలను చిత్రీకరించే, పంచుకునే, అనుభవించే విధానాల్లో వచ్చిన మార్పులను ఇది ప్రతిబింబిస్తుంది. ఎఫ్1 నుంచి ఎఫ్35 సిరీస్ వరకు, ఎఫ్ సిరీస్ తన కెమెరా సాంకేతికతలోని వారసత్వాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటూ, భారతదేశంలోని యువత, డిజిటల్ ప్రపంచంతో అనుసంధానమై ఉండే ఉద్యోగ నిపుణుల ఆకాంక్షలు, జీవనశైలికి అనుగుణంగా ముందుకు సాగుతోంది. గత 10 సంవత్సరాల్లో భారతదేశంలో ఎఫ్ సిరీస్‌కు చెందిన 3 కోట్లకు పైగా స్మార్ట్‌ఫోన్లు విక్రయించబడ్డాయి.
వ్యక్తిగత క్షణాలను చిత్రీకరించడమే కాకుండా, తమ చుట్టూ ఉన్న వ్యక్తులతో అనుభవాలను సృష్టించుకోవడానికి, అనుసంధానమవడానికి, పంచుకోవడానికి స్మార్ట్‌ఫోన్లను ఎక్కువగా ఉపయోగిస్తున్న తరంతో పాటు ఈ సిరీస్ కూడా
అభివృద్ధి చెందింది.ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ, ఎఫ్35 సిరీస్‌లో 100శీ వీక్షణ పరిధితో కూడిన 50ఓఖ అల్ట్రా-వైడ్ నేచురల్ సెల్ఫీ కెమెరా అందించబడింది. దీని ద్వారా ప్రతి ఫ్రేమ్‌లో ఎక్కువ మంది వ్యక్తులను, ఆ క్షణంలోని మరిన్ని విశేషాలను చిత్రీకరించవచ్చు.

వ్యాపారులకు బిగ్ రిలీఫ్.. రూ.2,000 దాటితే పడే ఛార్జీలపై బ్రేక్..



నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దీపావళి పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని సంచలన నిర్ణయం తీసుకుంది. యూపీఐ మార్చెంట్ లావాదేవీలపై ఆమోదించిన 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' ఛార్జీల అమలును నవంబర్ రెండో వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు మంగళవారం (అక్టోబర్ 13న) ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ గురువారం నుంచే ఈ ఛార్జీలు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, పండుగ వేళ తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యూపీఐ స్టీరింగ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే దీపావళి తర్వాత ఏ తేదీ నుంచి ఛార్జీలు అమలు చేస్తారో క్లారిటీ ఇవ్వలేదు. త్వరలో ఈ అంశంపై మరో ప్రకటన విడుదల చేస్తామని, అందులో తేదీని ప్రకటిస్తామని ఔఖఅఎ పేర్కొంది. ఇక, దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన యూపీఐ డిజిటల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్‌ను ఎన్‌పీసీఐ నిర్వహిస్తోంది. ఇటీవల ఈ ఛార్జీలను 2027 జనవరి వరకు వాయిదా వేయాలని ఔఖఅఎ యోచిస్తున్నట్లు మొదట వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో తాజాగా ప్రకటన వెలుగులోకి వచ్చింది. గత నెలలోనే యూపీఐ స్టీరింగ్ కమిటీ రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలపై 0.4 శాతం (40 బేసిస్ పాయింట్లు) ఎమ్‌డీఆర్ ఛార్జీ విధించాలని నిర్ణయించింది. సాధారణంగా మనం డిజిటల్ పేమెంట్లు స్వీకరించినందుకు వ్యాపారులు చెల్లించే రుసుమునే ఎమ్‌డీఆర్ అంటారు. ఉదాహరణకు 0.4 శాతం ఛార్జీ అంటే.. రూ. 2,000 లావాదేవీకి రూ. 8, అదే రూ. 10,000 లావాదేవీకి రూ. 40 వరకు ఎమ్‌డీఆర్ ఛార్జీ పడుతుంది. అయితే, ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో ఈ ఛార్జీల వల్ల పండుగ అమ్మకాల వేళ వ్యాపార వ్యయం పెరుగుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. అంతేకాకుండా, వ్యాపారులు ఈ ఛార్జీలను ఏదో ఒక రూపంలో వినియోగదారులపైనే మోపే ప్రమాదం ఉందనే అభిప్రాయం ఉంది. ఈ అంశంపై అక్టోబర్ 8న కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతూ.. యూపీఐపై ఎమ్‌డీఆర్ అంశాన్ని దానికి సంబంధించిన వాటాదారులే చూసుకుంటారని, ఛార్జీలను ఎప్పుడు ప్రారంభించాలనే నిర్ణయాన్ని పేమెంట్స్ వ్యవస్థకే వదిలేస్తున్నామని స్పష్టం చేశారు.

సౌదీ అరేబియాకు విమాన సర్వీసులు రద్దు!



సౌదీ అరేబియాలో భద్రతా పరిస్థితుల నేపథ్యంలో భారత విమానయాన సంస్థలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. సౌదీ అరేబియాలోని పలు నగరాలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమాన సర్వీసులను రద్దు చేశాయి. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఆకాశ ఎయిర్ సంస్థల విమాన సర్వీసులపై ఈ ప్రభావం పడింది. రియాద్, జెద్దా, దమ్మామ్ వంటి నగరాలకు విమాన రాకపోకలు నిలిచిపోయాయి. మదీనా మార్గంలోనూ కొన్ని విమాన సర్వీసులు ప్రభావితమయ్యాయి. సౌదీ అరేబియాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరగడంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు తమ విమాన సంస్థలను సంప్రదించి తాజా వివరాలు తెలుసుకోవాలని సూచించారు. విమానాల రద్దు కారణంగా ప్రయాణ తేదీల మార్పు లేదా టికెట్ డబ్బుల వాపసు గురించి ఆయా సంస్థలను సంప్రదించవచ్చు. పరిస్థితులను సమీక్షించిన తర్వాత విమాన సర్వీసుల పునరుద్ధరణపై సంస్థలు నిర్ణయం తీసుకోనున్నాయి.

డాలరుపై రూపాయి ఎదురుదాడి..
ఆరంభ ట్రేడింగ్‌లో 36 పైసలు హైక్



అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ వరుస సెషన్లలో తన జోరును కొనసాగిస్తోంది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ ఆరంభ ట్రేడింగ్‌లో దేశీయ కరెన్సీ మరో 36 పైసలు బలపడి డాలరుకు రూ.95.00 స్థాయి వద్ద స్థిరపడింది. ముడి చమురు ధరలు స్థిరపడటం, దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడుల రాక మెరుగుపడటంతో పాటు గ్లోబల్ డాలర్ ఇండెక్స్ బలహీనపడటం రూపాయికి కలిసొచ్చింది. గత కొద్ది రోజులుగా వరుసగా లాభపడుతూ వస్తున్న రూపాయి, నేటి ప్రారంభ ట్రేడింగ్‌లోనూ విదేశీ కరెన్సీ వర్తకుల నుంచి భారీ డిమాండ్‌ను చూసింది. ఇటీవల రికార్డు స్థాయి పతనానికి చేరిన రూపాయిని రక్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న పటిష్ట నియంత్రణ చర్యలే ఈ భారీ పుంజుకోవడానికి ప్రధాన కారణమని ఫారెక్స్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఫారెక్స్ హెడ్జింగ్ లావాదేవీలపై నిబంధనలను కఠినతరం చేయడంతో మార్కెట్లో డాలర్ కృత్రిమ డిమాండ్ తగ్గింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా ఆర్బీఐ జరిపిన సమయస్ఫూర్తి జోక్యం రూపాయికి అదనపు బలాన్ని చేకూర్చింది. రాబోయే రోజుల్లో రూపాయి రూ.94.50 నుంచి రూ.95.50 శ్రేణిలో మరింత స్థిరత్వాన్ని సాధించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఖర్చులు తగ్గించుకోవాల్సిందేవర్ధమాన, పేద దేశాలకు ఐఎంఎఫ్ నీతులు

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో ఇంధన సంక్షోభం నెలకొందని, ఈ పరిస్థితుల్లో వర్ధమాన దేశాలు, పేద దేశాలు తమ ఖర్చులను తగ్గించుకోవడం, రుణాలు రీషెడ్యూల్ చేసుకోవడం మినహా 'మరో మార్గం లేదు' అని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నీతులు వల్లె వేసింది. బ్యాంకాక్‌లో ఐఎంఎఫ్ వార్షిక సమావేశాల సందర్భంగా ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ (రీసెర్చ్) పెట్యా కోవా బ్రూక్స్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. అధిక మొత్తంలో రుణాలున్న దేశాలపైనా, చమురు దిగుమతి దేశాలపైనా ఇంధన సంక్ష?భం తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వరుసగా దిగ్భ్రాంతికర పరిణామాలను చవిచూస్తోందని, దేశాల రుణాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయని తెలిపారు. అదే ఆయా దేశాల



ద్రవ్యోల్బణం కూడా పెను సమస్యగా మారిందని చెప్పారు.

పెట్టుబడుల మందగమనం.. మూడేండ్ల కనిష్ఠానికి ప్రభుత్వ వ్యయాలు



దేశ పురోగతికి ప్రధాన గీటురాయిగా భావించే పెట్టుబడుల్లో మందగమనం చోటు చేసుకుంది. గడిచిన సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ2)లో రోడ్లు, వంతెనల వంటి ప్రభుత్వ మౌలిక వసతుల ప్రాజెక్టులతో పాటు కొత్త ఫ్యాక్టరీలు, ఇతర ప్రయివేటు పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనలు భారీగా తగ్గాయి.
కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు తగ్గడంతో పాటు నిలిచిపోయిన ప్రాజెక్టుల విలువ పెరగడం, పూర్తయిన ప్రాజెక్టుల సంఖ్య తగ్గడం లాంటి పరిణామాలు ఆర్థిక వ్యవస్థకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) తాజా ప్రాథమిక గణాంకాల ప్రకారం.. ఆర్థిక సంవత్సరం 2026-27 సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల్లో కొత్త పెట్టుబడి ప్రాజెక్టుల మొత్తం విలువ వార్షిక ప్రాతిపదికన 6 శాతం పతనమై రూ.10.2 లక్షల కోట్లకు పరిమితమైంది. అంతక్రితం జూన్ త్రైమాసికంతో పోలిస్తే మరింత క్షీణత చోటు చేసుకుంది. జూన్‌లో కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు 52 శాతం పెరగగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా 48.5 శాతం తగ్గాయి. ప్రభుత్వ పెట్టుబడుల మందగమనం మరింత ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు ఏడాది ప్రాతిపదికన 27 శాతం, జూన్ త్రైమాసికంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికంలో 47 శాతం తగ్గి రూ.1.3 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. దీంతో ప్రభుత్వ రంగ కొత్త పెట్టుబడులు మూడేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ప్రయివేటు రంగంలోనూ పరిస్థితి పెద్దగా ఆశజనకంగా లేదు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ప్రయివేటు కొత్త ప్రాజెక్టుల విలువ 2 శాతం, జూన్ త్రైమాసికంతో పోలిస్తే ఏకంగా 49 శాతం పతనమై రూ.8.8 లక్షల కోట్లకు దిగజారాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూలంగా కొత్త ప్రాజెక్టుల సంఖ్య 31 శాతం తగ్గి కేవలం 1,004కు పరిమితమైంది. డేటా సెంటర్లు, అణు విద్యుత్ కేంద్రాలు మినహా మూలధన ఆధారిత రంగాల్లో పెట్టుబడిదారుల స్పందన ఆశించిన స్థాయిలో లేకపోయిందని నిపుణులు చెబుతున్నారు. ఐటీ, విద్యుత్, లోహ రంగాల వంటి కొన్ని రంగాలకే పెట్టుబడులు పరిమితమవుతున్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనామిస్ట్ మదన్ సబ్నవిస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల మూలధన వ్యయం తగ్గడం కొత్త ప్రాజెక్టుల ప్రకటనలపై ప్రభావం చూపిందని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ గౌరా సేన్‌గుప్తా విశ్లేషించారు.

వంటింట్లో మంటలు.. 42 వస్తువుల్లో 41 ధరలు పెరుగుదల..!



గత కొంత కాలంగా పెరుగుతున్న ధరలు చూస్తే ధర పుట్ట కమానదు.. సామాన్యులపై ధరల భారం మరింత పెరుగుతోంది. నిత్యావసర వస్తువుల ధరలపై ప్రభుత్వ పర్యవేక్షణ గణాంకాల ప్రకారం, గత ఏడాది కాలంలో పోల్చిన 42 వస్తువుల్లో 41 వస్తువుల చిల్లర ధరలు పెరిగాయి. ఒక్క బంగాళాదుంపల ధరలు మాత్రమే తగ్గాయి. ముఖ్యంగా ఉల్లిపాయలు, చక్కెర, వంట నూనెల ధరలు గణనీయంగా పెరగడంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్లపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు, సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరినట్లు నివేదిక పేర్కొంది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలలో ఉల్లిపాయలు ముందున్నాయి. ప్రభుత్వ ధరల పర్యవేక్షణ డేటా ప్రకారం, ఏడాది కాలంలో ఉల్లిపాయల చిల్లర ధరలు దాదాపు 113 శాతం పెరిగాయి. అక్టోబర్ 12 నాటికి దేశవ్యాప్తంగా ఉల్లిపాయల సగటు చిల్లర ధర కిలోకు రూ.53.37గా నమోదైంది. మహారాష్ట్రలో ఖరీఫ్ ఉల్లి ఉత్పత్తి 5 నుంచి 7 శాతం తగ్గవచ్చని వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే, ప్రధాన ఉల్లి ఉత్పత్తి రాష్ట్రాల్లో కొత్త పంట మార్కెట్లకు చేరడం ప్రారంభమైంది. సరఫరా పెరిగితే ధరలు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రానున్న రోజుల్లో ఉల్లి ధరలు ఎంతవరకు తగ్గుతాయనేది కొత్త పంట రాక, మార్కెట్‌లో సరఫరాపై ఆధారపడి ఉంటుంది. కుటుంబాల ఆహార బడ్జెట్‌లో కీలకమైన పప్పుధాన్యాల ధరలు కూడా పెరిగాయి. ఏడాది క్రితం కిలో కందిపప్పు సగటు ధర సుమారు రూ.113 ఉండగా, అక్టోబర్ 12 నాటికి రూ.129కు చేరింది. దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో కందిపప్పు ధర కిలోకు రూ.140 నుంచి రూ.145 మధ్య నమోదైంది. శనగపప్పు సగటు ధర కూడా సుమారు 6.4 శాతం పెరిగి కిలోకు రూ.85 నుంచి రూ.91కు చేరింది. పప్పుధాన్యాల ధరల పెరుగుదలతో రోజువారీ ఆహార అవసరాల కోసం కుటుంబాలు మరింత ఖర్చు చేయాల్సి వస్తోంది. వంట నూనెల ధరలు పెరగడం గృహ బడ్జెట్లపై మరో భారంగా మారింది. సన్ ఫ్లవర్ నూనె సగటు చిల్లర ధర లీటరుకు సుమారు రూ.191కు చేరింది. ఇది ఏడాది క్రితంతో పోలిస్తే దాదాపు 18 శాతం అధికం. పామాయిల్ ధరలు 15.2 శాతం, సోయాబీన్ నూనె ధరలు 14.6 శాతం పెరిగాయి. ఆవ నూనె సగటు ధర కూడా లీటరుకు రూ.188 నుంచి రూ.204కు చేరింది. వంట నూనెల ధరల పెరుగుదల నేరుగా కుటుంబాల ఖర్చులపై ప్రభావం చూపడమే కాకుండా, ఆహార ఉత్పత్తుల తయారీ వ్యయాన్ని కూడా పెంచే అవకాశం ఉంది. ప్రజల రోజువారీ ఆహారంలో ప్రధానమైన బియ్యం ధరలు కూడా పెరిగాయి. సాధారణ బియ్యం సగటు చిల్లర ధర ఏడాదిలో సుమారు 12 శాతం పెరిగి కిలోకు రూ.47కు చేరింది. చక్కెర ధర కిలోకు రూ.56 దాటింది. నెల రోజుల క్రితం కిలో చక్కెర ధర సుమారు రూ.59గా ఉండగా, ఇటీవల కొంత తగ్గుదల కనిపించింది. అయినప్పటికీ, ఏడాది క్రితంతో పోలిస్తే చక్కెర ధర దాదాపు 22 శాతం అధికంగానే ఉంది. ఇదే సమయంలో గోధుమలు, గోధుమ పిండి ధరల్లో తక్కువ స్థాయి పెరుగుదల నమోదైంది. కూరగాయల ధరల్లోనూ పెరుగుదల కనిపిస్తోంది. అక్టోబర్ 12 నాటి ప్రభుత్వ గణాంకాల ప్రకారం, టమాటా సగటు చిల్లర ధర గత ఏడాది కిలోకు రూ.36 ఉండగా, ప్రస్తుతం రూ.42కు చేరింది. అయితే, బంగాళాదుంపల ధరలు ఏడాది కాలంలో 6 శాతానికి పైగా తగ్గాయి. ధరలను పోల్చిన 42 నిత్యావసర వస్తువుల్లో ఏడాదివారీగా ధర తగ్గిన ఏకైక వస్తువు బంగాళాదుంపలే కావడం గమనార్హం. మరోవైపు.. ఇతర కూరగాయల ధరలు కూడా భారీగా పెరిగాయి. సెప్టెంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి పెరగడం నిత్యావసర వస్తువుల ధరల ఒత్తిడిని స్పష్టం చేస్తోంది. ఉల్లిపాయలు, పప్పుధాన్యాలు, వంట నూనెలు, బియ్యం వంటి వస్తువుల ధరలు పెరగడంతో నెలవారీ ఖర్చులను నిర్వహించడం కుటుంబాలకు సవాలుగా మారుతోంది. ఉల్లి ధరల్లో ఉపశమనం లభించాలంటే కొత్త పంట మార్కెట్లకు చేరడం, సరఫరా మెరుగుపడటం కీలకం. మొత్తంగా, నిత్యావసర వస్తువుల ధరల కదలికలు సామాన్యుల జీవన వ్యయంపై ప్రభావం చూపుతుండటంతో రానున్న రోజుల్లో మార్కెట్ ధరలపై అందరి దృష్టి నెలకొంది.

ఎమోషన్‌కు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు!



నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'క్రేజీ కల్యాణం'. యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొదక్షన్ నెం. 2గా బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. బద్రప్ప గాజుల దర్శకుడు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న ఈ సినిమా రిలీజ్ కు వస్తోంది. సోమవారం నటుడు నరేష్ విజయ కృష్ణ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. ఇది హానెస్ట్ ఎంటర్టైనర్. బద్రప్ప, జగన్ మోహన్ రెడ్డి ఈ తరం దర్శక, నిర్మాతలు. దసరా పండుగ తెలుగు ప్రజలకు పెద్ద పండుగ. ఈ పండుగకు ఈ సినిమాను థియేటర్స్ లో బాగా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా నాలుగు స్తంభాలాట లాంటిది. నేను, తరుణ్ భాస్కర్, అనుపమ, అఖిల్.. ఈ నలుగురి క్యారెక్టర్స్ నాలుగు ఫిల్లర్స్ లాంటివి. అందులో నా పాత్రకు ఇంకొంత ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. ఒక ఊరిలో మధ్య తరగతి కుటుంబంలో జరిగే కథ ఇది. తల్లి దండ్రులకు పిల్లలకు మధ్య జరిగే ఎమోషనల్ స్ట్రగుల్ ఈ మూవీలో ప్రధానాంశం. ఈ ఎమోషన్ కు ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. డైరెక్టర్ బద్రప్పను నేను కె విశ్వ నాథ్తో పోల్చాను. ఎందుకంటే ఆయన తన సినిమాల్లో నేటివిటీకి దూరంగా వెళ్లకుండా కొత్త దారిలో కథ చెబుతూ, పాత్రలకు ఒక కొత్త అర్థాన్నిస్తూ సినిమా రూపొందిస్తారు. ఆ పాత్రలకు ఒక మంచి ముగింపు ఇస్తారు. బద్రప్ప కూడా అలాగే చేశా డు. ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తుంటాయి. నా పాత్రలో ఎమోషన్ తో పాటు ఫన్ ఉంటుంది. తరుణ్ భాస్కర్ చేసిన బాలరాజు పాత్ర ప్రతి ఊరిలో ఉంటుంది. ఊరిలో ఉండే ప్రతి మిడిల్ క్లాస్ అమ్మాయిని అను పమ పాత్ర ప్రతిబింబిస్తుంది.అలాగే అఖిల్ మంచి రోల్ చేశాడు.

అలియాస్ రుక్మిణిలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ...!



నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో.. నితిన్ హీరోగా చేస్తున్న క్రేజీ ప్రాజెక్టు 'అలియాస్ రుక్మిణి'. ఈ సినిమాలో రుక్మిణి పాత్రలో ఏ హీరోయిన్ నటిస్తుందా అనే సస్పెన్స్‌కు తాజాగా తెర దించారు మేకర్స్. ఇందులో నితిన్ సరసన హీరోయిన్‌గా బాలీవుడ్ ప్రముఖ నిర్మాత సాజిత్ నాడియాడ్‌వాలా మేనకోడలు ఆఫియా సయ్యద్ నటిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఓస్పెషల్ గ్లింప్ చేస్తూ.. 'కృష్ణుడి ప్రాణప్రదం.. ఏమాత్రం దాపరికం లేని, నిర్భయమైన, అత్యంత ప్రత్యేకమైన వ్యక్తిత్వం..!! ఆమెనే మన 'రుక్మిణి'.. రుక్మిణిగా ఆఫియా సయ్యద్‌ను పరిచయం చేసుకుందాం.

అలియాస్‌రుక్మిణి యొక్క ప్రాణం ఆమెనే..' అంటూ తెలిపారు. ప్రజెంట్ ఈ గ్లింప్స్ వైరల్ అవుతూ విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా.. మలయాళంలో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'ప్రేమలు' సినిమాకు హిందీ రీమేక్‌గావచ్చిన 'ప్రేమ్ కీటాను' చిత్రంతో ఈ ఆఫియా సయ్యద్ హీరోయిన్‌గా పరిచయమైంది. కానీ ఈ సినిమా పెద్దగా హిట్ అందుకోలేదు. మరి తెలుగులో అలియాస్ రుక్మిణితో ఎంట్రీ ఇస్తున్న ఈ అమ్మడుకి ఇక్కడ ఎలాంటి సక్సెస్ దక్కుతుందో వేచి చూడాల్సి ఉంది.

కాలు తొక్కినందుకు సినిమా నుంచి తీసెయ్యమన్నారు!



అలనాటి అందాల తారా లయ ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌పై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు వచ్చిన అవకాశాలు అందుకుంటూ మరోసారి నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్న ఈ హీరోయిన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని నందమూరి నటసింహం బాలకృష్ణపై షాకింగ్ కామెంట్స్ చేసింది. 'బాలకృష్ణ గారికి నిజంగానే అంత కోపమా' అనే ప్రశ్నపై స్పందించిన ఈమె.. షూటింగ్‌లో జరిగిన ఓ షాకింగ్ సంఘటనను చెప్పుకొచ్చింది. ఈ మేరకు నందమూరి బాలకృష్ణతో కలిసి 'విజయేంద్ర వర్మ' సినిమాలో నటించిన అనుభవాలను హీరోయిన్ లయ పంచుకుంటూ.. 'బాలయ్యకు చాలా కోపమని బయట విని మొదట్లో భయపడేదాన్ని. కానీ ఆయనతో పనిచేశాక ఎంతో సరదాగా, ఆప్యాయంగా ఉంటారని అర్థమైంది. 'బాలకృష్ణ గారికి నిజంగానే అంత కోపమా' అనే ప్రశ్నపై స్పందించిన ఈమె.. షూటింగ్‌లో జరిగిన ఓ షాకింగ్ సంఘటనను చెప్పుకొచ్చింది. ఈ మేరకు నందమూరి బాలకృష్ణతో కలిసి 'విజయేంద్ర వర్మ' సినిమాలో నటించిన అనుభవాలను హీరోయిన్ లయ పంచుకుంటూ..ఓ పాట షూటింగ్‌లో డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తుండగా పొరపాటున ఆయన కాలు తొక్కేశాను. దీంతో బాలయ్య ప్యాకప్ చెప్పి, నన్ను సినిమా నుంచి తీసేయమన్నట్లు మాట్లాడటంతో నిజంగానే భయపడి ఏడ్చేశాను. అది గమనించిన బాలయ్య వెంటనే నవ్వుతూ 'సరదాగా అన్నాను.. నిజమనుకోవద్దు' అని చెప్పారు. దాంతో కూల్ అయ్యాను.అంతేకాదు, డ్యాన్స్ చేసేటప్పుడు ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించేవారు కొన్నిసార్లు నాకంటే బాగా చేస్తున్నావంటూ మెచ్చుకునేవారు' అంటూ ఆనాటి జ్ఞాపకాలను పంచుకుంది లయ.

అంతుచిక్కని రహస్యాల నేపథ్యంలో!

ఆది సాయికుమార్ హీరోగా త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ భారీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ప్రొదక్షన్ నెం.3గా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ జి రుద్రప్ప నిర్మిస్తున్నారు. నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. దైవిక రహస్యాల నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమా.. ఆధ్యాత్మికత, విశ్వాసం, ప్రాచీన నమ్మకాలు, అంతుచిక్కని రహస్యాలతో కూడిన విభిన్నమైన సినీ ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. అద్భుతమైన కథనం, బలమైన భావోద్వేగాలు, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ప్రేక్షకులకు మరపురాని థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ అందించడమే లక్ష్యంగా చిత్ర బృందం ఈ సినిమాను రూపొందిస్తోంది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్ డార్క్, మిస్టరీ వాతావరణంతో పాటు ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ప్రొదక్షన్ నెం.3గా వ్యవహరిస్తున్న ఈ చిత్రాన్ని ప్రశాంత్ జి రుద్రప్ప నిర్మిస్తున్నారు. నవరసన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ఆధ్యాత్మికత, విశ్వాసం, ప్రాచీన నమ్మకాలు, అంతుచిక్కని రహస్యాలతో కూడిన విభిన్నమైన సినీ ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. అతీంద్రియ రహస్యాలతో ముడిపడిన కథను ఈ పోస్టర్ సూచిస్తోంది.

మా డ్రెస్సులు మాయం చేయడంతో పాటు సైజులు మారుస్తున్నారు..



గత కొద్ది కాలంగా ఏఐ టెక్నాలజీ హీరోయిన్ల పాలిట శాపంగా మారుతోంది. కొంతమంది కేటుగాళ్లు పలు హాట్ వీడియోలను నెట్టింట షేర్ చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎంతో మంది హీరోయిన్లు ఆవేదన వ్యక్తం చేయగా.. తాజాగా, హీరోయిన్ శ్రియా శరణ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతికత పేరుతో కొందరు ఆకతాయిలు హీరోయిన్ల ఫోటోలను క్రియేట్ చేస్తూ ఆన్‌లైన్‌లో వదులుతున్న తీరుపై ఆమె స్పందించారు. తాను కూడా ఈ ఏఐ మోర్ఫింగ్ బాధితురాలినేనని చెప్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆన్‌లైన్‌లో తన మార్ఫింగ్ ఫోటోలు చక్కర్లు కొట్టడంపై శ్రియ మాట్లాడుతూ.. కొన్నిసార్లు ఆ ఫొటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అని తనకు కూడా నవ్వొస్తుందని సరదాగా అన్నారు. మన శరీర భాగాల సైజులను ఇష్టమొచ్చినట్లు మార్చేయడం, మనం వేసుకున్న డ్రెస్సులను ఏఐ సాయంతో మాయం చేయడం లాంటివి చేస్తుంటారని తెలిపారు.

ఇలాంటి పిచ్చి పనులను చూసి మొదట్లో తేలిగ్గా తీసుకున్నప్పటికీ, రోజురోజుకూ ఇది చాలా విసుగు తెప్పిస్తోందని, అసలు ఇది పద్ధతే కాదని ఆమె మండిపడ్డారు. ఏఐ టెక్నాలజీ వల్ల ఎన్నో లాభాలు ఉన్నప్పటికీ, దానివల్ల జరిగే నష్టాలు కూడా అంతే ప్రమాదకరంగా ఉంటాయని శ్రియ హెచ్చరించారు. టెక్నాలజీ అనేది ప్రతిసారీ ఒకలా ఉండదని, కాలం మారుతున్న కొద్దీ ఇలాంటి సరికొత్త సమస్యలతో ఎలా జీవించాలో లేదా వాటిని ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శ్రియ చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి.

ఒక కల నిజమైనట్లు అనిపించింది!

పలు చిత్రాల్లో నటించి ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న యంగ్ బ్యూటీ అనన్య పాండే తాజాగా మరో అరుదైన బాధ్యతను అందుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈ భామ, రాబోయే ప్రతిష్టాత్మక ఎఎఈం అవార్డ్స్ 2027 వేడుకకు సహ-హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. నటిగా తనదైన అందం, అభినయంతో అభిమానులకు సంపాదించుకున్న ఆమె, ఇప్పుడు తొలిసారి యాంకర్‌గా అవార్డుల వేదికను హోస్ట్ చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా ఎఎఈంతో తనకున్నఅనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అనన్య ఎమోషనల్ కామెంట్స్ చేశారు. ఐఫా వేడుకలో భాగం కావడం తనకెప్పుడూ ఎంతో ప్రత్యేకమని అనన్య అన్నారు. అబుదాబిలోని యాస్ ఐలాండ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక వేదికపైనే తాను మొదటిసారి స్టేజ్ పెర్ఫార్మన్స్ ఇచ్చానని, ఆ క్షణంలో కలిగిన ఉత్సాహం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే ఉందని ఆమె గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఐఫా అవార్డ్స్‌ను టీవీల్లో చూస్తూ పెరిగిన తనకు, భారతీయ సినిమాకు సంబంధించిన ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించిందని తెలిపారు. కాలక్రమేణా ఐఫా తన సినీ ప్రయాణంలో ఒక అందమైన భాగంగా మారిపోయిందని చెప్పారు. ఇలాంటి ప్రతి వేడుక ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని, కెరీర్‌లో మరింతగా ఎదగడానికి, తనలోని సరికొత్త నైపుణ్యాలను బయటపెట్టుకోవడానికి మంచి అవకాశాలు దక్కాయని అనన్య వెల్లడించారు. ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకునే అవకాశం ఐఫా ద్వారానే కలిగిందని తెలిపారు. ఐఫా వేదికపై ఉండే జోష్, అక్కడి వాతావరణం, ప్రేక్షకుల అరుపులు, అలాగే మన సినిమా ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది ప్రముఖులంతా ఒకేచోట చేరి చేసే సందడిలో నిజంగానే ఒక ప్రత్యేకమైన మ్యాజిక్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఏకంగా ఐఫా అవార్డ్స్‌కు సహ-హోస్ట్‌గా ఒక సరికొత్త బాధ్యతతో ఐఫా 2027 వేదికపైకి వస్తుండటం తనకెంతో సంతోషాన్నిస్తోందని అనన్య అన్నారు. మళ్లీ అదే వేదికపైకి వెళ్లి, మన దేశంలోని గొప్ప నటులు, అద్భుతమైన కథలు, విజయాలను అందరితో కలిసి వేడుకలా సెలబ్రేట్ చేసుకునే అవకాశం రావడం తనలో ఉత్సాహాన్ని నింపుతోందని చెప్పారు.



విజయ్ సేతుపతి ట్రైన్ రిలీజ్ డేట్ ఫిక్స్!



తెలుగు, తమిళం అని తేడా లేకుండా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఈ హీరో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు చేస్తుండగా.. వాటిలో 'ట్రైన్' ఒకటి. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ మిస్కిన్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ డ్రామా నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా మరో సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ ఓ సరికొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ప్రయాణానికి సిద్ధమవ్వండి! ట్రైన్ ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలోకి దూసుకురానుంది!' అంటూ ప్రకటించారు. కాగా.. వీ క్రియేషన్స్ బ్యానర్‌పై కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్న ఈ మూవీలో శృతి హాసన్, నాజర్, దివ్వ శర్మ, జయరామ్, వినయ్ రాయ్, సరైన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్న బేబమ్మ

'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి, ఓవర్ నైట్ లోనే కుర్రకారు గుండెల్లో గూడు కట్టుకున్న క్యూట్ బ్యూటీ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. అయితే వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయింది. ఇక ఇటీవల విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాలో నటించిన ఈ ముద్దుగుమ్మ భారీ డిజాస్టర్‌ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్. ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఘోడ్గాంకర్ తెరకెక్కించనున్నారట. ఏవీఎస్ స్టూడియోస్ బ్యానర్‌పై అభిషేక్ ఎస్ వ్యాస్ దీనిని నిర్మిస్తుండగా, ఈ ఏడాదే ఈ సినిమా షూటింగ్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. చిత్రంలో కృతి శెట్టిని ఒక సరికొత్త అవతార్‌లో చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. తమిళంలో కలిసిరాని అదృష్టం.. బాలీవుడ్‌లో అయినా కలిసొచ్చి సరైన హిట్ పడుతుందా? లేక నిరాశనే ఎదురవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com